సంపుటి : 9
సంచిక : 358
ఆదివారం
20 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

# నా జీవితం ధన్యమైంది

## ప్రాణం ఉన్నంత వరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను.. : సీఎం చంద్రబాబు



- విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన
- గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ
- గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న మిగతా .. 2లో..

### విశాఖ ఆర్‌కే బీచ్‌లో
## 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో పాల్గొన్న సీఎం చంద్రబాబు



**విశాఖపట్నం, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి హోదాలో అధికారిక కార్యక్రమానికి వెళ్లినా, ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడంలో చంద్రబాబు తనదైన శైలిని ప్రదర్శించారు. విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో పర్యటన సందర్భంగా సాగర తీరంలో ఓ సాధారణ మిగతా .. 2లో..

### స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో
## యువతకు కొత్త అవకాశాలు : మోదీ



**సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్ పలు దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తాయని ప్రధాని మోదీ తెలిపారు. దేశీయ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగిందన్నారు. వర్చువల్‌గా నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'భారత్ ఇప్పటివరకూ 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసింది. వ్యాపారులు, రైతులు, మహిళలు.. ఇలా ప్రతి ఒక్కరికీ కొత్త మిగతా .. 2లో..

### యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం..
## నగదు మాత్రమే




**ఢిల్లీ, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రం తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని, నగదు మాత్రమే తీసుకుంటామని కొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. ఒకవేళ యూపీఐ పేమెంట్ చేస్తే అదనంగా చెల్లించాలంటున్నారు. ఢిల్లీ శివారులోని ఘజియాబాద్‌లో ఈ తరహా బోర్డులు మిగతా .. 2లో..

### మంగళగిరిలో మొదలైన
## మహిళల టీ-20 క్రికెట్ సందడి

**ఏసీఏ క్రికెట్ స్టేడియంలో డబ్ల్యూఏపీఎల్‌ను ప్రారంభించిన నారా బ్రాహ్మణి**
**డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించిన నారా బ్రాహ్మణి, బ్రాండ్ అంబాసిడర్ మిథాలీ రాజ్**




**మంగళగిరి, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసి, వారిని ఉమెన్ ప్రీమియర్ లీగ్, భారత మహిళా క్రికెట్ జట్టు వైపు నడిపించడమే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) తలపెట్టిన మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ తొలి సీజన్ ప్రారంభమైంది. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ మిగతా .. 2లో..

### స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం..
## 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం
### ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్



**విశాఖపట్నం, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఈరోజు పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు లేదా సమస్యలు ఎదురైతే మిగతా .. 2లో..

### ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్,
## రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

**ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని మంత్రి లోకేశ్ తీర్మానం**



**ఉండవల్లి, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ మిగతా .. 2లో..

### కరవులో రైతాంగం..
## దోపిడీలో కూటమి ప్రభుత్వం
### మాజీ మంత్రి పేర్ని నాని



**సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు మిగతా .. 2లో..

## నెరవేరనున్న వరంగల్ విమానాశ్రయ కల

**మంచి పేరును సూచించండి - 'ఎక్స్'లో ప్రజలను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** 'ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా పాలనలో వరంగల్ విమానాశ్రయ కల నెరవేరనుంది. కొత్త ఎయిర్‌పోర్టుకు ఏ పేరు పెడితే బాగుంటుందో సూచనలు ఇవ్వండి' అంటూ.. ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. "వరంగల్‌లో ప్రపంచస్థాయి విమానాశ్రయం ఏర్పాటు కల సాకారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో పదేళ్లు భారాస అధికారంలో ఉన్నప్పటికి వరంగల్ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైంది. మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించింది. కొత్త ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూసేకరణ చేసి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కు అప్పగించింది. ఇప్పటివరకు కాగితాలకే పరిమితమైన కొత్త విమానాశ్రయం.. ఇప్పుడు క్షేత్రస్థాయిలో వాస్తవ రూపం దాల్చుతోంది. ఇది కేవలం మిగతా .. 2లో..

### తిరుమలలో
## వైభవంగా సాగిన గరుడ సేవ

**రెండు లక్షల మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు**
**గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి**
**లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**



**తిరుమల, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు మిగతా .. 2లో..

### 50 ఏళ్లు నిండిన
## నేతన్నలందరికీ పెన్షన్లు

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



**అమరావతి/ శ్రీసత్యసాయి, సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేయడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఎటువంటి అక్రమాలు, అవినీతి తావులేకుండా అర్హులైన నేతన్నలందరికీ పెన్షన్లు అందజేసేలా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ నేపథ్యంలో నేతన్నల దరఖాస్తుల పరిశీలనలో జరుగుతున్న చేతివాటంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో సదుద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న లక్ష్యాన్ని నీరుగార్చుతున్న అధికారులపై కొరడా ఝుళిపించారు. దరఖాస్తుల పరిశీలన పేరుతో పచ్చనోట్లకు కక్కుర్తిపడిన ఇద్దరు మిగతా .. 2లో..

## మేం ఒకరిపై ఒకరం గూఢచర్యం చేసుకుంటాం

**చైనాపై ట్రంప్ వ్యాఖ్యలు**



**సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా-అమెరికా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. అదే సమయంలో ఇరుదేశాలూ పరస్పరం గూఢచర్యం చేసుకుంటాయని పేర్కొన్నారు. గతంలో తమ అధికారి ఒకరు మాట్లాడుతూ అగ్రరాజ్యంపై చైనా గూఢచర్యం చేస్తోందని చెప్పినట్లు మిగతా .. 2లో..

### రష్యా ఆంక్షల బిల్లుపై సంతకం..
## భారత్‌పై 100 శాతం సుంకాలకు ట్రంప్‌నకు పవర్

**సెప్టెంబర్ 19 విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యా, ఇరాన్, చైనా, భారత్‌లను ఒకేసారి దెబ్బతీసే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాలపై సుంకాల మోత మోగించేందుకు అధ్యక్షుడికి అధికారం దఖలు పడింది. 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరుతో తీసుకొచ్చిన బిల్లుకు బుధవారం సభ 262-159 ఓట్లతో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును గత నెలలోనే సెనెట్ ఆమోదించింది. ఇప్పుడు ట్రంప్ సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. దీంతో భారత్, చైనాతో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి. భారత్ అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా సుంకాలు విధించనుంది. ఈ చట్టంపై మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# నా జీవితం ధన్యమైంది..

పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

**దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!**

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు. "నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

**మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు**

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!**

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ.10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

**విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!**

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు. విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

**అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!**

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు. "2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది. అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో పాల్గొన్న సీఎం చంద్రబాబు



మహిళ విక్రయిస్తున్న మురి మిక్చర్ (మసాలా మిక్చర్) రుచి చూశారు. ఆ తర్వాత ఆమె జీవనోపాధి గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. తాను ఒంటరి మహిళనని, ఈ వ్యాపారమే జీవనాధారమని ఆమె చెప్పడంతో సీఎం తక్షణమే స్పందించారు. ఆమెకు వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఊహించని ఈ పరిణామంతో ఆ మహిళ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అంతకుముందు, ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఆర్కే బీచ్‌లో జీవీఎంసీ చేపట్టిన 'సాగర స్వచ్ఛత' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చేపడుతున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెదజాలరిపేటలో ఏర్పాటు చేసిన 'ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్' పైలట్ సైట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సముద్రంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, రీసైక్లింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. పర్యటనలో భాగంగా సముద్రంలో వ్యర్థాలను సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులు, స్కూబా డైవర్లతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. చేపల వేటతో పాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం ద్వారా తమకు ప్రోత్సాహకాల రూపంలో అదనపు ఆదాయం వస్తోందని మత్స్యకారులు సీఎంకు వివరించారు. సేకరించిన వ్యర్థాలను డిజిటల్ పద్ధతిలో తూకం వేయడాన్ని చంద్రబాబు పరిశీలించి, మత్స్యకారులకు ప్రోత్సాహకాలను అందజేశారు. సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్, పాత వలలను ఎలా తొలగిస్తున్నారో స్కూబా డైవర్లను అడిగి తెలుసుకున్నారు. సాగర స్వచ్ఛతలో భాగంగా మొత్తం 1,200 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడమే లక్ష్యమని అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం మ్యాన్‌హోళ్లు, మురుగు కాల్వల శుభ్రత కోసం జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సీవరేజ్ రోబో పనితీరును ప్రదర్శనశాలలో పరిశీలించారు. జీవీఎంసీ చేపట్టిన సాగర స్వచ్ఛత ప్రాజెక్టుకు లభించిన అంతర్జాతీయ గుర్తింపు, భవిష్యత్ కార్యాచరణపై బ్లూమ్‌బెర్గ్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. మొత్తంగా ఈ పర్యటనలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూనే, సామాన్య ప్రజల సమస్యలపై సీఎం చూపిన శ్రద్ధ ప్రత్యేకంగా నిలిచింది.

## యువతకు కొత్త అవకాశాలు : మోదీ

అవకాశాలు లభిస్తాయి. ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. గుర్తింపు పొందిన స్టార్టప్‌లు దాదాపు సగం వరకు టైర్-2 టైర్-3 నగరాల నుంచే పుట్టుకొస్తున్నాయి. దేశీయ లక్ష్యాల సాధనకు యువతే కీలకం' అని మోదీ అన్నారు. యువతకు సమగ్ర అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు.

## నగదు మాత్రమే

ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పెద్ద వ్యాపార సంస్థలు, ఇ-కామర్స్ సంస్థలతో (పీ2ఎం) చేసే రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి దీనిని అమలు చేయనున్నారు. కాగా, దీనిపై వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదనపు ఖర్చును భరించేందుకు వారు ఇష్టపడటం లేదు. ఎండీఆర్ అమల్లోకి వచ్చిన తర్వాత వీలైనంత వరకు నగదునే చెల్లించాలని పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసేవారిని ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు.

## మహిళల టీ-20 క్రికెట్ సందడి

లీగ్ సీజన్-1 ప్రారంభోత్సవ వేడుకలకు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ను లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా స్టేడియం ప్రాంగణానికి చేరుకున్న నారా బ్రాహ్మణికి ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, రాజ్యసభ ఎంపీ, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు ఘనస్వాగతం పలికారు. అనంతరం డబ్ల్యూఏపీఎల్ ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ తో కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు.

**మహిళా క్రికెటర్లకు ఇదో మంచి అవకాశం**

ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మాట్లాడుతూ ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్స వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మహిళా క్రికెటర్లకు ఇదో అద్భుతమైన అవకాశమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు వీరంతా రోల్ మోడల్స్ గా నిలుస్తారని చెప్పారు. ప్రతిభ ఉండి అవకాశం వస్తే మహిళా క్రీడాకారిణులు అద్భుతంగా రాణిస్తారని తెలిపారు. మంగళగిరి వేదికగా యువ మహిళా క్రికెటర్లకు అవకాశం కల్పించిన ఏసీఏ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

**ఏసీఏ క్రికెట్ స్టేడియంలో 7 రోజులు 13 మ్యాచ్ లు**

భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ డబ్ల్యూఏపీఎల్ కు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారు. ఫ్రాంచైజీ విధానంలో రాష్ట్రంలో తొలిసారిగా జరుగుతున్న డబ్ల్యూఏపీఎల్ టీ-20 క్రికెట్ పోటీల్లో నాలుగు జట్లు రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్, అమరావతి ఈ-ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ తలపడనున్నాయి. మంగళగిరిలోని ఏసీఏ క్రికెట్ స్టేడియంలో 7 రోజుల పాటు 13 మ్యాచ్ లు జరగనున్నాయి. శనివారం మధ్యాహ్నం రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్ మధ్య ప్రారంభ మ్యాచ్ జరిగింది. సాయంత్రం అమరావతి ఈ-ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ మధ్య రెండో మ్యాచ్ జరిగింది. డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా బ్రాహ్మణికి నిర్వాహకులు ప్రత్యేక జ్ఞాపికను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ డి.విష్ణుతేజ, ఏసీఏ క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వైఎస్ రంగనాథ్ పాల్గొన్నారు.

## 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం

వెంటనే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్థానిక వార్డుల వారీగా బలమైన నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనే సంఖ్య కంటే, గెలిచే బలం ఉన్న స్థానాల్లో నిలబడి కచ్చితమైన విజయం సాధించడమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాళ్టి నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నారని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాజకీయాల్లో అనుభవమే అసలైన పాఠమని పేర్కొంటూ, జీవీఎంసీ పరిధిలో గతంలో గెలిచిన, రెండో స్థానంలో నిలిచిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేవలం టికెట్ వస్తే సరిపోదని... ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేడర్ నిరంతరం శ్రమించాలని నిర్దేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత వల్లే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కొండంత భరోసా లభించిందని, ఉత్తరాంధ్రకు వస్తున్న భారీ ప్రాజెక్టులే దీనికి నిదర్శనమని చెప్పారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందని తెలిపారు.

## రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

## దోపిడీలో కూటమి ప్రభుత్వం

ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.

## నెరవేరనున్న వరంగల్ విమానాశ్రయ కల

విమానాశ్రయం మాత్రమే కాదు.. వరంగల్‌కు పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు కొత్త ద్వారం కానుంది. విమాన రాకపోకలు ప్రారంభమైతే వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి కూడా కొత్త అవకాశాలు రానున్నాయి. వరంగల్ నుంచి విమానంలో ప్రయాణించే రోజు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. తెలంగాణకు మామునూరు విమానాశ్రయం కొత్త ప్రతీకగా నిలవాలి" అని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

**విమానాశ్రయానికి పలు పేర్లు సూచించిన దర్శకులు**

సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో చేసిన ట్వీట్‌కు పలువురు దర్శకులు స్పందించారు. సాంస్కృతిక, వారసత్వ స్ఫూర్తిని ప్రతిబింబించేలా రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లేదా కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అని పేర్లు పెడితే అర్థవంతంగా ఉంటుందంటూ ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సూచించారు. వెంటనే స్పందించిన సీఎం 'దట్స్ ది స్పిరిట్' అని బదులిచ్చారు. మరో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల స్పందిస్తూ.. సమ్మక్క సారక్క పేరు పెట్టాలని సూచించారు. దిల్‌రాజుకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ స్పందిస్తూ "మామునూరు విమానాశ్రయ ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసినందుకు సీఎంకు ధన్యవాదాలు" అని తెలిపింది.

## వైభవంగా సాగిన గరుడ సేవ

తరలివచ్చిన భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్ఠి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.

**భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు.

**టీటీడీ ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ**

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

## నేతన్నలందరికీ పెన్షన్లు

అధికారులను సస్పెండ్ చేయించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. నూతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, నేతన్నల సేవలో పథకంపై అమలు తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన పెన్షన్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి...వాటి పరిశీలిన గురించి ఆరా తీశారు. నూతన పెన్షన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16,521 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికీ వెళ్లి అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 84 వేలకుపైగా చేనేతలకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు.

**అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం**

శ్రీసత్యసాయి, అనంతపురం సహా పలు జిల్లాల్లో దరఖాస్తు దారుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు తెలిసిందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. చేనేతలందరికీ ఆర్థిక మేలు కలుగజేయాలన్నది సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం సహా పలు పథకాలను ఇటీవల ప్రారంభించారన్నారు.ఇపుడు 50 ఏళ్లు నిండిన చేనేతలకు నూతన పెన్షన్లు అందజేయాలని నిర్ణయించారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎంతో సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నీరుగార్చేలా కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులొస్తున్నాయని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన ప్రతి నేతన్నకూ పెన్షన్ అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఎటువంటి అపోహాలకు నేతన్నలు గురికావొద్దని, ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరంలేదని చేనేతలకు తెలిపారు. అర్హత ఉంటే ప్రభుత్వమే పెన్షన్ అందజేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

**ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్**

శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు ఉద్యోగులు దరఖాస్తుల పరిశీలన సమయంలో చేనేతల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసిందని మంత్రి సవిత మండిపడ్డారు. తాము ఇచ్చే అనుమతులతోనే పెన్షన్లు వస్తాయంటూ డీవో రమణారెడ్డి. ఏడీవో శీనా నాయక్ నేతన్నల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ఆ ఇద్దరు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాను ఆదేశించారు. చేనేతల నుంచి వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు. అర్హులను గుర్తించే సర్వేలో రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాల్లో పర్యటించి స్వయంగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆ ఇద్దరు ఉద్యోగులనూ తొలగిస్తూ కమిషనర్ రేఖారాణి ఉత్తర్వులు జారీచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు పాల్గొన్నారు.

## మేం ఒకరిపై ఒకరం గూఢచర్యం చేసుకుంటాం

గుర్తు చేసుకున్నారు. అయితే తాము కూడా బీజింగ్ విషయంలో అదే పని చేస్తుండడంతో దాన్ని అంతగా పట్టించుకోలేదని తెలిపారు. "జిన్‌పింగ్ వచ్చే వారం అమెరికాకు వస్తారు. ఇతర దేశాలతో సంబంధాలు అంత బాగా లేకపోయినా.. మాకు చైనాతో మంచి అనుబంధం ఉంది. ఆయనతో సమావేశానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఆ చర్చల్లో పలు కీలక ఒప్పందాలు చేసుకోబోతున్నాం. ప్రతి ఒప్పందం వెనక ఓ స్పష్టమైన ఉద్దేశం ఉంటుంది" అని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**జిన్‌పింగ్ అమెరికా పర్యటన..**

ఈ నెలాఖరులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. సతీమణి పెంగ్ లియువాన్‌తో కలిసి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ట్రంప్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి మరీ ఆయనను స్వాగతించనున్నట్లు తెలుస్తోంది. వాషింగ్టన్ డీసీకి సమీపంలోని సైనికస్థావరంలో ఉన్న ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి జిన్‌పింగ్ దంపతులను అధ్యక్షుడు స్వాగతించే అవకాశం ఉందని వైట్‌హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల నేతలతో ప్రముఖ టెక్ దిగ్గజాలు ఎలాన్ మస్క్, సుందర్ పిచాయ్, టిమ్ కుక్, మైఖేల్ డెల్, జెఫ్ బెజోస్, జెన్సన్ హువాంగ్, శామ్ ఆల్ట్‌మన్, జేన్ ఫ్రేజర్ సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ భేటీలో కృత్రిమ మేధ అంశం కూడా ప్రస్తావనకు రానుందని సమాచారం.

## భారత్‌పై 100 శాతం సుంకాలకు ట్రంప్‌నకు పవర్

ఇప్పటికే భారత్ స్పందించింది. రష్యాపై ఆంక్షలను, తమపై సుంకాలను విధిస్తే అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు తప్పదని భారత్ హెచ్చరించింది. అమెరికా చర్యను చైనా తిరస్కరించింది. భద్రతా మండలి ఆమోదం లేని ఏ చర్యనూ ఆమోదించబోమని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

**ఈ చట్టంతో ట్రంప్‌నకు లభించిన అధికారాలు ఇవే..**

రష్యా నాయకత్వంపై ఆంక్షల విధింపు, ఇంధన రంగంపై ఆంక్షల విధింపు, ఇప్పటికే ఉన్న ఆంక్షలను తప్పించుకుంటూ చమురు సరఫరా చేసే నౌకల షాడో ఫ్లీట్‌పైనా ఆంక్షలు విధించడానికి అధ్యక్షుడికి అధికారం దక్కుతుంది. రష్యా చమురు, గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించేలా ఒత్తిడి తెస్తూ భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించే అధికారం, ఇరాన్‌పై మరిన్ని ఆంక్షల విధింపు.

# ఎడిటర్ వాయిస్

## తిరువూరు మున్సిపల్ పోరులో 'పై చేయి' పాకులాట..!

తిరువూరు మున్సిపల్ ఎన్నికల్లో పైచేయి కోసం అధికార టీడీపీ లో మరోసారి వివాదాలు తలెత్తే అవకాశం ఉందని స్థానికంగా చర్చ సాగుతోంది. ఒకప్పుడు వైసీపీకి కంచుకోటగా ఉన్న ఈ మున్సిపాలిటీలో కౌన్సిలర్ల బలాబలాల సమీకరణాలను మార్చడంలో, వైసీపీ కౌన్సిలర్లను చేర్చుకోవడంలో స్థానిక ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు కీలక పాత్ర పోషించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా టీడీపీ మద్దతుతో కొలికపోగు నిర్మల ఎన్నికయ్యారు. అయితే, ఈ ఎన్నిక ప్రక్రియలో, అభ్యర్థి ఎంపిక వెనుక తనకంటూ పూర్తి పట్టు నిలుపుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి ప్రయత్నించారు.

ప్రస్తుతం మారుతున్న సీన్..

తిరువూరు మున్సిపాలిటీ రాజకీయాలు ప్రస్తుతం చాలా ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా మారాయి. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ భారీ మెజారిటీ సాధించినప్పటికీ, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు, పార్టీ ఫిరాయింపుల కారణంగా ప్రస్తుతం మున్సిపాలిటీ టీడీపీ వశమైంది. 2021 ఎన్నికల్లో తిరువూరులోని మొత్తం 20 వార్డులకు గాను వైసీపీ ఏకంగా 17 వార్డులను గెలుచుకుని మున్సిపాలిటీపై పట్టు పెంచుకుంది. కానీ, ఇప్పుడు పార్టీని లీడ్ చేసేందుకు సీనియర్ నేత ముందుకు రావడం లేదని చర్చ ఉంది. దీంతో పార్టీ పరిస్థితి మారుతుందని అంటు న్నారు.

ఇక, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, తిరువూరు ఎమ్మెల్యేగా కొలికపూడి విజయం సాధించడంతో సమీకరణాలు మారాయి. నలుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరడంతో వైసీపీ తన మెజారిటీని కోల్పోయింది. ఆతర్వాత.. తిరిగి పార్టీని నిలబెట్టే ప్రయత్నాలు కూడా ముందుకు సాగడం లేదు. మరోవైపు.. మున్సిపాలిటీని చేజిక్కించుకున్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, పట్టణంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నేతృత్వంలో నిధుల మంజూరు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇది తమకు లాభిస్తుందని కూటమి నాయకులు అంచనా వేస్తున్నారు.

మొత్తంగా చూస్తే.. తిరువూరు మున్సిపల్, స్థానిక ఎన్నికల రాజకీయాల్లో పైచేయి సాధించేందుకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్థానిక క్యాడర్‌పై తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్నారు. దీంతో గత 15 రోజులుగా విస్తృతంగా ప్రజల మధ్య ఉంటున్నారు. ఇక, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కూడా నియోజకవర్గ అభివృద్ధి వ్యవహారాలు... కీలక నిర్ణయాల్లో తన మార్కు చూపించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ఇద్దరు కీలక నేతల విభేదాలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టినప్పటికీ.. స్థానిక ఎన్నికల సమరం నేపథ్యంలో ఏ విధంగా మలుపుతిరుగుతాయన్నది చూడాలి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## పెళ్లి పేరుతో మోసం.. నటుడు, రెజ్లర్ సౌరవ్ గుజ్జర్‌పై కేసు



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : పెళ్లి పేరుతో మోసం చేశాడని ఓ యువతి ఫిర్యాదు చేయడంతో నటుడు, రెజ్లర్ సౌరవ్ గుజ్జర్‌పై గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆగస్టులో గచ్చిబౌలి పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. 2021లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై, ఆ తర్వాత వాట్సాప్ వేదికగా సన్నిహిత సంబంధం కొనసాగించాడని పేర్కొంది. 2021 డిసెంబర్ 25న తొలిసారి కలుసుకున్నామని, భార్యతో సమాన హక్కులు కల్పిస్తానని హామీ ఇచ్చాడని ఫిర్యాదులో తెలిపింది. "అమెరికాలో ఉన్నప్పుడే కాకుండా, భారత్‌కు వచ్చిన తర్వాత కూడా ఇద్దరం కలిసి జీవించాం. కలిసి వ్యాపారం చేద్దామని నమ్మించడంతో అమెరికాలో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి వచ్చా. ఆ తర్వాత మళ్లీ ఉద్యోగం చేద్దామనుకున్నా అతని వేధింపుల వల్ల ఉద్యోగంపై దృష్టి పెట్టలేకపోయా. పెళ్లి గురించి నిలదీసినప్పుడల్లా ఫోన్ బ్లాక్ చేసి దూరమయ్యేవాడు. 2025 అక్టోబర్ నుంచి 2026 మార్చి వరకు నాతోనే ఉన్నాడు. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చి కలిసి ఉంటూ ఉన్నట్టుండి ఎలాంటి సమాచారం లేకుండా మాయమయ్యాడు" అని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన గచ్చిబౌలి పోలీసులు సౌరవ్ గుజ్జర్‌ను మధ్యప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్నారు.

## వారసత్వ మార్పునకు లంచం డిమాండ్

**అనిశాకు చిక్కిన గోవిందరావుపేట తహసీల్దార్ - బిల్లులు పంపడానికి లంచమడిగిన వార్డెన్ సైతం..**



**పట్టుబడిన తహసీల్దార్ సృజన్‌కుమార్**

గోవిందరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ : లంచం తీసుకుంటూ వేర్వేరు జిల్లాల్లో ప్రభుత్వాధికారులు శుక్రవారం అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కారు. ఆయా జిల్లాల అనిశా అధికారులు తెలిపిన వివరాలు.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన ఓ రైతు గత సంవత్సరం మృతి చెందగా..ఆయన పేరు మీద ఉన్న భూమిని తన పేరుకి మార్చాలంటూ ఆయన కుమార్తె గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్‌కుమార్‌ను సంప్రదించారు. దీనికిగాను తహసీల్దారు రూ.15 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలి భర్త అనిశా అధికారులను ఆశ్రయించారు. అనిశా డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలోని అధికారులు వలపన్ని సృజన్‌కుమార్ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. నిందితుడిని శనివారం వరంగల్ అనిశా న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హాస్టల్ వార్డెన్..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సత్యనారాయణపురం ఎస్టీ హాస్టల్‌లో పనిచేస్తున్న వంట కుక్‌కు సంబంధించిన బిల్లులు పంపించడానికిగాను ఆ హాస్టల్ వార్డెన్ వాలుసింహ లంచం డిమాండ్ చేశారు. దీంతో కుక్ అనిశా అధికారులను ఆశ్రయించారు. కుక్ వద్ద నుంచి వార్డెన్ రూ.14 వేలు లంచం తీసుకుంటుండగా అనిశా డీఎస్పీ రమేశ్ ఆధ్వర్యంలోని అధికారులు పట్టుకుని.. ప్రాథమిక విచారణ పూర్తి చేసి కేసు నమోదు చేసి వార్డెన్‌ను రిమాండ్‌కు పంపారు.

## రద్దయిన నోట్ల మార్పిడి ముఠా అరెస్టు

**రూ.1.38 కోట్ల నోట్లు స్వాధీనం**



కాజీపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : రద్దయిన నోట్లను మార్పిడి చేస్తామంటూ మోసం చేస్తున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను హనుమకొండ జిల్లా కాజీపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మరో నిందితుడు రియాజ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.1,38,50,000 (రద్దయిన రూ.500, రూ.1,000) నోట్లను, ఓ కారు, 10 సెల్‌ఫోన్లు, ప్రస్తుత నగదు రూ.6 వేలను స్వాధీనం చేసుకుని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ముఠా వివరాలను వెల్లడించారు. బెంగళూరుకు చెందిన ముల్లా అబ్బాస్ అలీ ఎలియాస్ ఎంఏ అలీ హైదరాబాద్‌లో బిల్డర్ వద్ద ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులైన మంచిర్యాల జిల్లాకు చెందిన బాషనేని మల్లేశ్, కరీంనగర్ జిల్లాకు చెందిన తంగెళ్ల కృష్ణమోహన్, సిద్దిపేట జిల్లాకు చెందిన కుక్కల సంపత్, హనుమకొండ జిల్లాకు చెందిన రైనాకుల శ్రీధర్, బాలసముద్రానికి చెందిన పల్లపు రాజు, వరంగల్ జిల్లాకు చెందిన మాంకాల గణేశ్, కరీమాబాద్‌కు చెందిన మహంకాళి శ్యాంసుందర్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించడానికి రద్దయిన నోట్ల చలామణిని ఎంచుకున్నారు. వీరంతా చెన్నైకి చెందిన రియాజ్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి నుంచి 2016లో ప్రభుత్వం రద్దు చేసిన రూ.500, రూ.1,000 నోట్లను తీసుకొని ఓ కారులో వరంగల్, హనుమకొండలో మార్పిడి చేయడానికి వచ్చారు. శుక్రవారం కాజీపేట చౌరస్తాలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. కారు ఆపకుండా పారిపోవడానికి ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు బృందాలుగా వెళ్లి నిందితులను పట్టుకున్నారు. ముఠాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందికి రివార్డులు ప్రకటించనున్నట్లు సీపీ శ్వేత వెల్లడించారు.

**వేలంగి గ్రామంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా**

## సిసి రోడ్లు ప్రారంభోత్సవం



కాకినాడ రూరల్, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ : కరప మండలం వేలంగి గ్రామంలో శనివారం రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా గ్రామంలో నూతనంగా నిర్మితమైన సీసీ రోడ్లను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన వేలంగి గ్రామంలో అభివృద్ధి పనుల నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీవెనలతో మూడు కోట్ల రూపాయలను ఈ గ్రామానికి ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. తధానంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి పి ఉమామహేశ్వరి గ్రామంలో ఉన్న కూటమి నాయకులు, మండల నాయకులు, మండల అధికారులు, పంచాయతీ సిబ్బంది, మరియు గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్యే పంతం నానాజీని సాలువాతో సత్కరించి షీల్డ్( దేవుని పటము ) అందజేయడం జరిగింది.

**వేళంగి వినాయక చవితి మహోత్సవంలో**

## పాల్గొన్న ఎమ్మెల్యే నానాజీ



కాకినాడ రూరల్, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ : కరప మండలం వేళంగి గ్రామంలో వినాయక మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ మహోత్సవ కార్యక్రమంలో శనివారం నాడు శాసనసభ్యులు పంతం నానాజీ హాజరయ్యారు. ఆయనకు నిత్యానందపురం సెంటర్ ఆలయ కమిటీ చైర్మన్ మరియు మార్కెట్ సెంటర్ ఆలయ కమిటీ చైర్మన్ మరియు గ్రామ కూటమి నాయకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల జనసేన నాయకులు, టిడిపి నాయకులు, గ్రామంలో ఉన్న కూటమి నాయకులు మరియు పంచాయతీ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

**పార్టీ శ్రేణుల ఐక్యతతో**

## స్థానిక ఎన్నికలకు సిద్ధం



నిడదోలు, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ : పెరవలి: నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం పెరవలిలోని దీపిక కళ్యాణ మండపంలో నిర్వహించారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు, నిడదవోలు-కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు గిరిజాల బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో వివిధ పదవుల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులను ముఖ్య అతిథులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన పోరాటంపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఆయన పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల అభిప్రాయం ప్రతిబింబిస్తుందని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పెన్షన్లపై హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ తరఫున పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామాల్లో పార్టీకి ఉన్న బలాన్ని మరింత పెంచేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పార్టీ పరిస్థితిపై నాయకులు చర్చించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పెరవలి మండల అధ్యక్షుడు గండేపల్లి రామకృష్ణ, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కాచర్ల ప్రసాద్‌తో పాటు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైయస్సార్ పార్టీకి రుణపడి ఉంటా : బిల్లకుర్తి అంజిబాబు



మండపేట టౌన్, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ : మండపేట పట్టణానికి చెందిన బిల్లకుర్తి అంజిబాబు శనివారం సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా నియమకం చేసినందుకు మండపేట వైసిపి కార్యాలయంలో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగంలో తనకు బాధ్యతలు అప్పగించడం పట్ల అంజిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు అభినందనలు తెలియజేసారు. బిల్లకుర్తి అంజిబాబు మాట్లాడుతూ చరిత్రలో తొలిసారి నాయి బ్రాహ్మణులకు నిజమైన గుర్తింపు జగన్మోహనరెడ్డి పాలనలోనే జరిగిందని అలాంటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున నాకు డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానన్నారు. తొలిసారిగా తిరుపతి తిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డులో మా నాయి బ్రాహ్మణులకు స్థానం కల్పించారని, 20 వేల జీతంతో ఉద్యోగ భద్రత కల్పించారని, నెలకు 150 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తును అందించారని, పార్టీ వ్యవస్థలో 60 శాతం పైగా బీసీలకు అవకాశం కల్పించిన ఘనత ఒక్క జగన్మోహన్ రెడ్డి కి మాత్రమే చెల్లిందని అలాంటి గౌరవం ఇచ్చిన నాయకుడికి నాయి బ్రాహ్మణులందరం అండగా ఉంటామని తెలుపుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా మండపేటలో తోట త్రిమూర్తులును ఎమ్మెల్యేగా చేయడానికి ఐక్యంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ పార్టీ అబ్జర్వర్ దూలం వెంకన్నబాబు, రాష్ట్ర కిసాన్ సెల్ సెక్రెటరీ రెడ్డి రాధాకృష్ణ, మండపేట పట్టణ రూరల్ కన్వీనర్లు పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జి, పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పోతంశెట్టి ప్రసాద్, కోణాల చంద్రబోస్, సాధనాల శివ భగవాన్, వల్లు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




# పని చేయకపోతే చర్యలు తప్పవు!

- ఎస్ డబ్ల్యు పీసీ షెడ్లు పనిచేయకపోతే... కార్యదర్శి పనితీరు లేనట్టే...
- పీజీఆర్ఎస్ విషయంలో నిర్లక్ష్యం మీకే ప్రమాదం..
- పంచాయతీ కార్యదర్శులకు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి శాంతామణి హెచ్చరికలు







**రాయవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఇకపై సహించేది లేదని తూర్పుగోదావరి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి.శాంతామణి పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. రాయవరం మండలం లొల్ల గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత లొల్ల గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్డబ్ల్యూపిసి) సందర్శించిన డిపివో అక్కడి నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులపై అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయవరం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులతో పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో శాంతామణి కీలక సూచనలు చేశారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రతిరోజూ చెత్త నుండి సంపద తయారీ కేంద్రం షెడ్డును తప్పనిసరిగా సందర్శించాలని స్పష్టం చేశారు. షెడ్డు సక్రమంగా పనిచేయకపోతే అక్కడి పంచాయతీ కార్యదర్శి పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతాయని ఆమె హెచ్చరించారు. కేవలం కార్యాలయంలో కూర్చుని విధులు నిర్వహించడం కాకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, సమస్యలను పరిష్కరించే బాధ్యత కార్యదర్శులపై ఉందని తేల్చిచెప్పారు. చెత్త నిర్వహణను కేవలం పారిశుద్ధ్య కార్యక్రమంగా చూడకుండా, దాని ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా వర్మీ కంపోస్ట్ తయారీ ద్వారా ఆదాయం సమకూర్చి గ్రీన్ అంబాసిడర్ల జీతభత్యాల చెల్లింపులకు వినియోగించాలని ఆదేశించారు.

**ఇక నేర్చుకునే సమయం కాదు... పనిచేసే సమయం!**

పంచాయతీ కార్యదర్శులకు ఇక నేర్చుకునే సమయం దాటిపోయిందని, ఇక క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపించాల్సిన సమయం వచ్చిందని శాంతామణి ఈ సందర్భంగా తేల్చి చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ నుంచి ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. అవసరమైతే సస్పెన్షన్, ఇంక్రిమెంట్ల కోత వంటి క్రమశిక్షణ చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు కేవలం స్థానిక రాజకీయ నాయకులే కారణమనే భావన కాకుండా, పంచాయతీ కార్యదర్శుల పనితీరు, కృషి గురించి ప్రజలు మాట్లాడేలా పనిచేయాలని డిపివో సూచించారు. ముఖ్యంగా ప్రజల నుంచి వచ్చే పిజిఆర్ఎస్ ఫిర్యాదుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే అర్జీదారునితో మాట్లాడి సమస్యను పూర్తిగా తెలుసుకోవాలని, అర్జీదారుడు రెండోసారి ఫిర్యాదుకు వెళ్లే పరిస్థితి తీసుకురాకుండా వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.ఎస్.ఎస్. సూర్యనారాయణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో ఎం. శ్రీనివాసరావు, మండలంలోని వివిధ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**మార్పు మొదలయ్యేనా..!**

ఏది ఏమైనప్పటికీ లొల్ల గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కేవలం పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమంగా కాకుండా, పంచాయతీ వ్యవస్థలో క్షేత్రస్థాయి పనితీరుపై జిల్లా స్థాయి అధికారిణి దృష్టి సారించిన సందర్భంగా మారింది. ఎస్డబ్ల్యూపిసి షెడ్లు కేవలం నామమాత్రంగా కాక, సక్రమంగా పనిచేయడం, చెత్త నుంచి సంపద తయారు చేయడం, వర్మీ కంపోస్ట్ ద్వారా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు అందించడం, పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన సమస్యలపై పరిష్కారం చూపకుండా దాటవేయడం వంటి అంశాలపై ఉన్నతాధికారులు చేసిన సూచనలు ఇప్పుడు ఆచరణలో ఎంతవరకు కనిపిస్తాయన్నదే అసలు ప్రశ్న. అధికారుల హెచ్చరికలు సమావేశం ముగిసిన వెంటనే మరుగునపడకుండా.. పంచాయతీల పనితీరులో కనిపించే మార్పుగా మారితేనే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి అసలు అర్థం చేకూరుతుంది. లేదంటే ఎప్పటిలాగే హెచ్చరికలు, సమావేశాలు, ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలకు తావిచ్చినట్లవుతుంది.

# డాక్టర్ రమేష్‌కు స్వామి వివేకానంద లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

**పాండిచ్చేరిలో ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్, జర్మనీ ఆధ్వర్యంలో ఘన సత్కారం**



**కోరుకొండ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న ఫోరం ఫర్ ఆర్టీఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ చైర్మన్, బిందు వాయిస్ మాసపత్రిక అధినేత,పబ్లిషర్ డాక్టర్ కొమ్మోజు రమేష్ కు స్వామి వివేకానంద లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేయడం పట్ల పలువురు రమేష్ ను అభినందించారు. పాండిచ్చేరిలో ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్, జర్మనీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని డాక్టర్ కొమోజును ఘనంగా సత్కరించి అభినందిస్తూ ప్రతిష్టాత్మక అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన సామాజిక సేవలను కొనియాడారు.డాక్టర్ కొమ్మోజు రమేష్ 2010 నుంచి అక్షర రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించి, దాని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించడం, సామాజిక అవగాహన, మానవ హక్కులు, సమాచార హక్కు, విద్య తదితర రంగాల్లో పలు కార్యక్రమాల్లో చెరుకైన పాత్ర పోషిస్తూ వచ్చారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఇప్పటికే పలు అవార్డులు, ప్రశంసలు లభించాయి.ప్రస్తుతం ఫోరం ఫర్ ఆర్టీఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ చైర్మన్గా బాధ్యతలు నిర్వహిస్తూ సమాచార హక్కు, మానవ హక్కులు, పారదర్శకత, న్యాయం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ కొమ్మోజు రమేష్ మాట్లాడుతూ ఈ అవార్డు నాకు ఎంతో ఆనందాన్ని, మరింత బాధ్యతను కలిగించింది. స్వామి వివేకానంద లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును నా వ్యక్తిగత గౌరవంగా కాకుండా, ఇప్పటివరకు నేను చేసిన సామాజిక సేవకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నన్నారు. సమాచార హక్కు, మానవ హక్కులు, పారదర్శకత, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాను.సమాజానికి మనకు చేతనైనంత సేవ చేయడమే నిజమైన బాధ్యత అని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు డాక్టర్ కొమ్మోజు రమేష్‌ను అభినందించి, ఆయన మరింతగా సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# శబరిమలై అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శబరిమల లోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఇటీవల అయ్యప్ప దీక్ష చేపట్టిన ఆయన, దీక్ష పూర్తయిన సందర్భంగా శబరిమలై చేరుకుని స్వామివారికి ఇరుముడి సమర్పించారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకుని దీక్షను విరమించారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శబరిమలై పర్యటన సందర్భంగా కేరళ ప్రభుత్వం ప్రోటోకాల్ ఏర్పాట్లు చేసింది. కేరళ పోలీసులు భద్రత కల్పించగా, ఆలయంలో ప్రోటోకాల్ నిబంధనల మేరకు స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే వెంట మండపేట ప్రాంతం నుంచి వెళ్లిన 24 మంది అయ్యప్ప స్వాములు కూడా ఉన్నారు. ఎమ్మెల్యేతో కలిసి వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆరోగ్యకర సమాజ నిర్మాణానికై పోషణ మాసోత్సవాలు

**రాయవరంలో 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు**



**రాయవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలోని దళితవాడ అంగన్వాడీ-1 కేంద్రంలో శనివారం 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో, సూపర్‌వైజర్ విష్ణుకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విష్ణుకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యంగా మునగాకు వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆకుకూరలతో పాటు ప్రోటీన్లు సమృద్ధిగా లభించే ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న తాజా, వేడి భోజనం, ఇతర పౌష్టికాహార సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

**తిరుమల శ్రీవారిని దర్శించుకున్న**

# యువనేత పెందుర్తి అభిరామ్



**సీతానగరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వేకుజామున విరామ సమయంలో శ్రీ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడవాహన సేవలో సాయంత్రం పాల్గొన్నారు.










శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వ్యవహారంలో వాస్తవాలు దాచి

# కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు

## ప్రొసీడింగ్స్ ఆధారంగా వాస్తవాలు వెల్లడించిన మంత్రి సుభాష్




**ద్రాక్షారామ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని కొంతమంది రాజకీయ నాయకులు చేస్తున్న ఆరోపణలు, రాజకీయ నాటకాలు హాస్యాస్పదంగా ఉన్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విషయాలను దాచి, వాటి నెపాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అమరావతి నుంచి విడుదల చేసిన వీడియో సందేశంలో, ఆలయం విషయంలో ఆ నలుగురే సూత్రధారులు అని, ఇన్ని సంవత్సరాలు విషయం తెలిసి కూడా ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. 2022 ఆగస్టు 18 తేదీతో దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో కొన్ని హిందూ దేవాలయాలను, మత సంస్థలను చట్టం ప్రకారం ప్రచురించిన విషయం స్పష్టంగా ఉందని తెలిపారు. అప్పటి ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రక్రియ జరిగితే అప్పటి ప్రజాప్రతినిధులకు, మంత్రులకు, ఎంపీ, ఎమ్మెల్సీలకు ఆ విషయం తెలియదా అని నిలదీశారు. ఆలయ కమిటీలో ఉన్న వ్యక్తులకు పూర్తి అవగాహన ఉన్నప్పటికీ రాజకీయ ప్రయోజనాల కోసం మౌనం వహించారని, ట్రస్ట్ వారసులను తప్పుదారి పట్టించడం విడ్డూరంగా ఉందని అన్నారు. 2022 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వానికి లెక్కలు చెప్పారా, హుండీ లెక్కలు, రసీదు పుస్తకాలు, బ్యాంకు ఖాతాలు సరిగ్గా నిర్వహించారా అని ప్రశ్నిస్తూ, భూములు ఎవరు దోచుకున్నారో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. హుండీ చోరీ ఘటనపై సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలను ఎందుకు పట్టుకోలేకపోయారని, ఆ సమయంలో అప్పటి వ్యవస్థలు ఏం చేశాయని నిలదీశారు. అకాల మరణించిన నాయకుడిని రాజకీయాల్లోకి లాగడం దురదృష్టకరమని, ద్రాక్షారామం మార్కెట్‌లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు సహాయం చేయడానికి ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నవారు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

**పారదర్శకతతో ఉత్సవాలు నిర్వహణ మరియు ప్రజలకు వాస్తవాలు**

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వ్యవహారంలో ఇకపై పారదర్శకమైన నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ కమిటీలో మార్పులు ఉంటాయని, పారదర్శకంగా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, భక్తుల విశ్వాసానికి ఎలాంటి భంగం కలగకుండా చూస్తామని తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి వాస్తవాలను కరపత్రాలు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు తెలియజేస్తామని, సమాచార హక్కు చట్టం ద్వారా కూడా అధికారిక పత్రాలు పొందవచ్చని చెప్పారు. 1960, 1990 నాటి పాత రాజకీయాలు మానుకోవాలని, కాలం మారిందని, ప్రజలు చైతన్యవంతులయ్యారని స్పష్టం చేశారు. రాజకీయాలకు ఆలయాలను వేదికగా మార్చకుండా, రామచంద్రపురం నియోజకవర్గం, ద్రాక్షారామం అభివృద్ధి కోసం అందరం కలిసి ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు.

# ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంపై వైసీపీ కుల రాజకీయాలు

## మంత్రి సుభాష్‌పై విషపూరిత రాజకీయాలు - కాపు సామాజిక వర్గాన్ని దూరం చేసేందుకే ఈ కుట్రలు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వ్యవహారాన్ని రాజకీయ అంశంగా మార్చి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని కూటమి నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రామచంద్రపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, క్లస్టర్-2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ మాట్లాడుతూ.. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంపై మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుడు పిల్లి సూర్యప్రకాష్ ముందుగా ఈ వ్యవహారానికి సంబంధించి అవగాహనతో అధికారిక రికార్డులను పరిశీలించాలని అన్నారు. 2022లో ధూపదీప నైవేద్యానికి సంబంధించి దేవాదాయ శాఖకు చేసిన అభ్యర్థనల నేపథ్యంలో అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రొసీడింగ్స్ వెలువడిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. File No. COE/880/2022-J, R.Dis.No.J1/880/2022, తేదీ 18-08-2022తో దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన పత్రంలో కొన్ని హిందూ దేవాలయాలు, మత సంస్థలను ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ యాక్ట్, 1987లోని సెక్షన్ 6(ఎ)(ఐఐ) కింద ప్రచురించినట్లు ఉందని తెలిపారు. 2022లోనే దేవాదాయ శాఖకు సంబంధించిన ప్రక్రియ కొనసాగినప్పుడు అప్పటి ప్రభుత్వంలో ఉన్న వైసీపీ ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ఎందుకు ప్రశ్నించలేదు? ఇప్పుడు అదే అంశాన్ని తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని నిందించడం, మంత్రి సుభాష్ పై విషం కక్కడం ఎందుకు అని రిష్వంత్ రాయ్ ప్రశ్నించారు. ముందు మీ వైసీపీ నాయకులను ప్రశ్నించండన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్‌పై బురదజల్లే ఉద్దేశంతోనే కొంతమంది వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఈ ఆలయ అంశాన్ని రాజకీయంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. మంత్రి సుభాష్‌కు కాపు సామాజిక వర్గాన్ని దూరం చేయాలనే ఉద్దేశంతోనే ఈ వ్యవహారాన్ని రాజకీయంగా ఉపయోగించేందుకు కుట్రలు జరుగుతున్నాయి అని ఆయన ఆరోపించారు. ఆలయ వ్యవహారంపై అవాస్తవాలు ప్రచారం చేయకుండా అధికారిక పత్రాలను పరిశీలించాలని సూచించారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. దేవాలయం భక్తుల విశ్వాసానికి సంబంధించినది.. రాజకీయాలకు వేదిక కాకూడదు అని చంద్రశేఖర్ అన్నారు. క్లస్టర్-2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు మాట్లాడుతూ.. ద్రాక్షారామంలోని ప్రసిద్ధ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ పరిసరాలను రాజకీయ వివాదాలకు కేంద్రంగా మార్చడం సరికాదన్నారు. పిల్లి సూర్యప్రకాష్ మిడిమిడి జ్ఞానంతో, అవగాహన లేకుండా ఆలయ వ్యవహారంపై మాట్లాడుతున్నారని విమర్శించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయనపై రాజకీయ విమర్శలు చేస్తున్నారని బాబురావు ఆరోపించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కుల, మత, వర్గ విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేసి విఫలం అయ్యారని, పవిత్రమైన దేవాలయాన్ని రాజకీయాలకు ఉపయోగించి, ప్రజల మనోభావాలతో ఆటలాడవద్దు అని తీవ్రంగా మండిపడ్డారు. దేవుని దగ్గర కులాలు ఏంటి? దేవుడు అందరివాడు. దేవుని సన్నిధిలో కులాలు, వర్గాల రాజకీయాలు చేయడం సరికాదు. ఒక పవిత్రమైన ఆలయ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించడం వల్ల నియోజకవర్గ ప్రజల్లో అనవసరమైన అపోహలు, విభేదాలు ఏర్పడే అవకాశం ఉంది. దేవుని ముందు అందరూ సమానమే అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిపాలనా ప్రక్రియలకు సంబంధించిన అంశాలను ప్రస్తుత ప్రభుత్వంపై మోపడం సరికాదని వారు పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఏవైనా ఉండొచ్చు.. కానీ దేవాలయాల విషయంలో, ప్రజల విశ్వాసాల విషయంలో రాజకీయ నాయకులు బాధ్యతగా వ్యవహరించాలి. రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేసే రాజకీయాలు వద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో పలువురు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాల సేకరణకు

# మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్




**అమలాపురం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసులకు నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాల సేకరణను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ ఫోరెన్సిక్ వాన్‌ను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభించారు. నేరస్థలానికి నేరుగా చేరుకుని అక్కడికక్కడే ఆధారాలను గుర్తించడం, డాక్యుమెంటేషన్ చేయడం, సేకరించడం, భద్రపరచడం, ప్రాథమికంగా పరిశీలించడం వంటి సేవలను అందించేలా ఈ వాహనాన్ని రూపొందించారు. నేరస్థల పరిరక్షణ, సాధారణ భౌతిక ఆధారాల సేకరణతో పాటు సాధారణ కంటికి కనిపించని ఆధారాలను గుర్తించేందుకు హై-ఇంటెన్సిటీ ఫోరెన్సిక్ లైట్ వంటి అధునాతన పరికరాలు ఇందులో ఉన్నాయి. మొబైల్ ఫోరెన్సిక్ వాన్‌లో రక్తం, వీర్యం వంటి జీవ ఆధారాల ప్రాథమిక పరీక్ష, సేకరణ కిట్లు, డీఎన్ఏ నమూనా సేకరణ కిట్, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాల స్క్రీనింగ్ కిట్లు, గన్‌షాట్ రెసిడ్యూ సేకరణ కిట్, బుల్లెట్ హోల్ పరిశీలన కిట్, ట్రేస్ ఎవిడెన్స్ కోసం స్టీరియో మైక్రోస్కోప్, డీఎస్ఎల్ఆర్ కెమెరా, బాడీ వోర్న్ కెమెరా, జీపీఎస్, సీసీటీవీ, డాష్‌బోర్డ్ కెమెరా, వెయింగ్ బ్యాలెన్స్, మినీ రిఫ్రిజిరేటర్, ఎల్ఈడీ స్క్రీన్, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, బార్‌కోడ్ స్కానర్, థర్మల్ ప్రింటర్, జనరేటర్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే డిజిటల్ ఇన్వెస్టిగేషన్ కిట్, ఫోరెన్సిక్ ఇమేజర్, పెన్‌డ్రైవ్‌లు, మెమరీ కార్డులు, ఎస్ఎస్‌డీ స్టోరేజ్, డిజిటల్ పరికరాల అక్విజిషన్, ఇమేజింగ్, ట్రయాజ్ టూల్స్, ఫీల్డ్ ట్రయాజ్ పరికరాలు కూడా ఇందులో ఉన్నాయి. అనుమానాస్పద అగ్ని, గ్యాస్ ఘటనల్లో గ్యాస్ గుర్తింపు, డిజిటల్ ఆధారాల సేకరణ, భద్రపరచడం వంటి సేవలను కూడా ఈ వాన్ ద్వారా అందించవచ్చు. మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ అందుబాటులోకి రావడంతో నేరస్థల స్పందన మరింత వేగవంతమై, శాస్త్రీయ ఆధారాల సేకరణ, ఆధారాల భద్రత, కేసుల దర్యాప్తులో పోలీసు అధికారులకు మెరుగైన ఫోరెన్సిక్ సహకారం అందుతుందని ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ పుల్లారావు, డీసీఆర్‌బీ సీఐ రాజేష్, ఆర్ఐ బ్రహ్మానందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఘాట్లను పరిశీలించిన అదనపు ఎస్పీ



**కాకినాడ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు డా.ఎమ్. కిషోర్ కుమార్, అదనపు ఎస్పీ (అడ్మిన్), 1 టౌన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ ఎమ్. నాగ దుర్గారావు ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్ కలిసి 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగన్నాధపురం బ్రిడ్జి, ఉప్పుటేరు వద్ద గల మూడు నిమజ్జన ఘాట్లు, వార్ఫ్ రోడ్‌లోని బ్రహ్మంగారి మఠం వద్ద గల నిమజ్జన ఘాట్లను సందర్శించి, గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా తీసు కోవలసిన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై ఎమ్. కిషోర్ కుమార్, అదనపు ఎస్పీ (అడ్మిన్) సంబంధిత అధికారులకి సూచనలు జారీ చేశారు. నిమజ్జన ఘాట్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.భక్తులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అలాగే వాహనాల రాక పోకల కు అంతరాయం లేకుండా ముందస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని నిమజ్జన ఘాట్ల వద్ద బారికేడింగ్ ఏర్పాటు చేసి, ప్రజలు ప్రమాదకరంగా నీటిలోకి వెళ్లకుండా తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం సమయంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు, అవసరమైన చోట ట్రాఫిక్ డైవర్షన్స్ పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిమజ్జన విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలు భక్తుల గుంపుల కారణంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా క్రిటికల్ పాయింట్ల వద్ద తగినంత ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు.ఘాట్ల వద్ద తగిన లైటింగ్, బ్యారికేడింగ్, ఇతర భద్రతా ఏర్పాట్లు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందు కు అంబులెన్స్, ఫైర్ సర్వీసెస్, అవసరమైన రెస్క్యూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలు ఘాట్ వద్ద ఎక్కువసేపు నిలిచి పోకుండా, వచ్చే వెళ్లే వాహనాలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సజావుగా సాగేలా చూడాలని,పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ఫైర్, వైద్య, విద్యుత్ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా సురక్షితంగా నిర్వహించాలని సూచనలు జారీ చేసినారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# రావులపాలెం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లి బాలు మృతి

కార్యకర్త మరణాన్ని చూసి భావోద్వేగానికి గురైన చిర్ల



**రావులపాలెం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లి బాలు శనివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొడగట్లపల్లి గ్రామంలోని కొల్లి బాలు స్వగృహానికి చేరుకున్న చిర్ల జగ్గిరెడ్డి, ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీకి కష్టపడ్డ కార్యకర్త మరణం చూసి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు చిర్ల జగ్గిరెడ్డి. అనంతరం కొల్లి బాలు అంతిమయాత్రలో చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని శవపేటిక మోశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కొల్లి బాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కరుడుగట్టిన కార్యకర్తగా పార్టీ కోసం నిరంతరం పనిచేశారని చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ చురుగ్గా ఉంటూ పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రతిపక్షంలో ఉంటూనే అధికార పార్టీ విధానాలను ప్రశ్నిస్తూ పార్టీ తరఫున బలంగా తన వాణిని వినిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు.పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన కొల్లి బాలు మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన సేవలను పార్టీ శ్రేణులు ఎప్పటికీ గుర్తుంచుకుంటాయని పేర్కొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన ర్యాలీ




**రామచంద్రపురం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత" అనే అంశంపై అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కే.చిట్టిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. మన రాష్ట్రాన్ని స్వచ్ఛందంగా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, సాస సమన్వయకర్త ఆర్.ఎన్. రఘురాం, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఎన్.వి. రమణ, డాక్టర్ కే. శ్రీను మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హసన్ బాదలో ఘనంగా అంగన్వాడీ పోషణ మాసోత్సవాలు



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం హసన్ బాదలో అంగన్వాడీ పోషణ మాసోత్సవాలను శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి వి.వి. వరాహలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు మరియు మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్య అలాగే గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు, తల్లులు, పిల్లలకు బాలామృతం, పోషణ ఆహార కిట్లను నాగిరెడ్డి సతీష్ రావు చేతుల మీదుగా అందజేశారు. అంగన్వాడీ సూపర్వైజర్ ఐ.కల్యాణి రిచ్ ప్రోటీన్, పోషణ, మై ప్లేట్ గురించి గర్భిణీ స్త్రీలకు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పి.చంద్రకళ, కే.లక్ష్మీ జ్యోతి, ఎన్. దుర్గజ్యోతి, పి.లక్ష్మీ, ఏ.పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది ఏ.ఎన్.ఎం వెంకటరమణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, ఎం.ఎల్.హెచ్.పి లిదియా, జీ.ఎం.ఎస్.కే. నాగదేవి, ఆశా వర్కర్లు డి. పుష్పలత, పి.నాగలక్ష్మి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశాలను సందర్శించిన

# జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.కే.మహబూబ్ బాషా



**కె.గంగవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశాలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.కే. మహబూబ్ బాషా మరియు జిల్లా సమగ్ర శిక్షణ అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏఎంఓ) పి.రాంబాబు సందర్శించారు. ఉదయం జెడ్.పి.హెచ్.ఎస్ దంగేరులో నిర్వహించిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశాన్ని, మధ్యాహ్నం జెడ్.పి.హెచ్.ఎస్ కె.గంగవరంలో నిర్వహించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి బోధన-అభ్యసన ప్రక్రియకు సంబంధించిన పలు సూచనలు అందించారు.

**ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యత**

భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.కే. మహబూబ్ బాషా మాట్లాడుతూ సైన్స్‌ను కేవలం చెప్పడం ద్వారా కాకుండా, విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి, చేయించి బోధించినప్పుడే విషయంపై మరింత స్పష్టమైన అవగాహనతో పాటు అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రతి సైన్స్ ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను బోధించేటప్పుడు సాధ్యమైనంత వరకు ప్రయోగాత్మక విధానాన్ని అనుసరించాలని సూచించారు. విద్యార్థులతో ప్రయోగాలు చేయించడం ద్వారా వారిలో సైన్స్ పట్ల ఆసక్తి, పరిశీలనా దృక్పథం, ప్రశ్నించే స్వభావం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రయోగాత్మక బోధనను సమర్థవంతంగా అమలు చేసే ఉపాధ్యాయుల కృషికి విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాశాఖ నుంచి తగిన గుర్తింపు లభించేలా ప్రోత్సహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు నిర్వహించిన కొన్ని ప్రయోగాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించి, ఉపాధ్యాయులతో కలిసి ప్రయోగాల్లో పాల్గొన్నారు. ప్రయోగాత్మక బోధన ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని ఎలా రేకెత్తించవచ్చో ఉపాధ్యాయులతో చర్చించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సైన్స్‌కు సంబంధించిన ప్రయోగాలు, ప్రాక్టికల్ కార్యకలాపాలు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్ సుబ్రహ్మణ్యాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశించారు. ప్రతి పాఠశాలలో అందుబాటులో ఉన్న సైన్స్ ల్యాబ్‌లు, పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు అనుభవాత్మక అభ్యసన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం డివైఇవో పి.రామలక్ష్మణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ చోడిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథ రాజుకు

# జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రివర్యులు చెరుకువాడ రంగనాథ రాజు జన్మదినం సందర్భంగా తాడేపల్లి గూడెంలోని ఆయన స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఈ సందర్భంగా చెరుకువాడ రంగనాథ రాజుకి శాలువా వేసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు తదితర అంశాలపై మర్యాదపూర్వకంగా చర్చించారు.



# జిల్లాలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ప్రారంభం

**కస్తూరిబా గాంధీ వసతి గృహంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే దివ్య**

**సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చిన వీఆర్ఏలు - హై స్కూల్ గ్రౌండ్ లో ప్లే ట్రాక్ నిర్మించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం**



**కోటనందూరు, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి.ప్రభుత్వ విఫ్ యనమల దివ్య కాకినాడ జిల్లా, కోటనందూరు కస్తూర్బా గాంధీ వసతి గృహంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతల సూరిబాబు అధ్యక్షతన ఎస్ఎంసి చైర్మన్ చందక శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్ కోపరేటివ్ చైర్మన్ పెనుముచ్చు నాగేశ్వరరావు లతో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విఫ్ యనమల దివ్య కు స్కౌట్ విద్యార్థులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటిన ఆమె పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మొక్కలు నాటడడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత స్వీకరించాలని కోరారు.అనంతరం కస్తూర్బా గాంధీ వసతి గృహంలో అన్ని విభాగాలను పరిశీలించిన ఎమ్మెల్యే యనమల దివ్య విద్యాబోధన, భోజనం ఇతర వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు చాక్లెట్లు అందజేసారు. అనంతరం స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.స్వచ్ఛతా హీసేవా ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ నెలరోజుల పాటు జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతపై అందరిలోనూ అవగాహన కల్పించాలని కోరారు.

**అస్తవ్యస్తంగా ఉన్న ప్లే గ్రౌండ్‌ను శుభ్రపరచాలని ఎమ్మెల్యే దివ్యకు వినతి**

కోటనందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్‌లో పాడుబడిన బిల్డింగ్ మెటీరియల్ డంప్ చేయడంతో గ్రౌండ్ అస్తవ్యస్తంగా తయారయింది. ఈ గ్రౌండ్ ను పరిశుభ్రపరిచి ప్లే ట్రాక్ నిర్మిస్తే మరింత మంది క్రీడాకారులు తయారు చేయడానికి ఉపయోగపడుతుందని దీన్ని పరిశుభ్రపరడానికి నిధులు కేటాయించాలని హైస్కూల్ ఉపాధ్యాయ బృందం, ఓల్డ్ స్టూడెంట్స్ ఎమ్మెల్యే దివ్య కు వినతిపత్రం సమర్పించగా గ్రౌండ్ ను పరిశీలించి ప్లేట్రాక్ ఇతర వసతులు కల్పిస్తామని క్రీడాకారులు కావల్సిన దుస్తులు మెటీరియల్ అందిస్తానని హామీ ఇచ్చారు.

**సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం సమర్పించిన వీఆర్ఏలు**

తక్కువ జీతాలతో అర్థాకలితో ఉద్యోగాలు చేసుకుంటున్నా మాకు జీతాలు పెంచి మా సమస్యలు పరిష్కరించాలని ఈరోజు ఎమ్మెల్యే యనమల దివ్య కు కోటనందూరు మండల వీఆర్ఏలు వినతిపత్రం సమర్పించగా ఎమ్మెల్యే దివ్య సానుకూలంగా స్పందించి సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, యర్రా చినసత్యనారాయణ, వాసం నాగేశ్వరరావు, సామినీడి కృష్ణార్జున,బోడపాటి సత్యనారాయణ, బైలపూడి శ్రీ రామమూర్తి, ఎల్ ఎస్ ఎన్ మూర్తి, కొరుప్రోలు రఘునాథ్, అంకారెడ్డి వెంకటేష్, చింతకాయల రవి, గుడివాడ తాతబాబు, నెమ్మాది సత్యనారాయణ, ముప్పిడి జమీలు తదితరులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, తాహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, హై స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కాకినాడ తీరంలో**

# ఘనంగా అంతర్జాతీయ తీరప్రాంత పారిశుధ్య దినోత్సవం

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**





**కాకినాడ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** సముద్ర జీవ రాశులను రక్షించడానికి తీర ప్రాంతాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపు నిచ్చారు. కాకినాడ తీరప్రాంతం లో ఐసీజీఎస్ కాకినాడ ఆధ్వర్యం లో కాకినాడ రూరల్ సూర్యాపేట ఎన్టీఆర్ బీచ్ లో అంతర్జాతీయ తీరప్రాంత పారిశుధ్య దినోత్సవం 2026 స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు శనివారం అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది. సముద్ర తీరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే ముప్పుపై ప్రజల్లో అవగాహన, చైతన్యాన్ని తీసుకువచ్చే ఉద్దేశంతో నిర్వహించిన ఈ బృహత్ కార్యక్రమానికి కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పి జి.బిందు మాధవ్,ఎం ఎల్ సి కర్రి పద్మశ్రీ, కాకినాడ రూరల్ మాజీ శాసన సభ్యుడు పిల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర ప్రజాప్రతి నిధులు, అధికారులు స్థానిక పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా, కేఎస్పీఎల్, వేదాంత, రిలయన్స్, ఓఎన్జీసీ, కోరమండల్ వంటి ప్రముఖ పారిశ్రామిక, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు వీరందరితో కలిసి ఉత్సాహంగా శ్రమించి, సముద్ర తీరం నుంచి ఏకంగా 500 కిలోల చెత్తాచెదారాన్ని తొలగించి తీరాన్ని సుందరంగా మార్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులు అందరూ చేత స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పడి యాభై వసంతాలు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకుని కోస్ట్ గార్డ్ విశ్రాంత సైనికులు, స్వచ్ఛందంగా పాల్గొన్న సంస్థల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంస పత్రాలు, జ్ఞాపకాలు అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, తీర ప్రాంత పరిశుభ్రత అనేది ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతరం, సుస్థిరంగా కొనసాగాల్సిన ప్రక్రియని పేర్కొన్నారు. ముఖ్యంగా సముద్ర జీవ రాశులను రక్షించడానికి తీర ప్రాంతాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచాలని పిలుపు నిచ్చారు. యువత, విద్యార్థులు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమా లలో మరింత చురుగ్గా పాల్గొనాలనిఆకాంక్షించారు. సముద్ర తీర ప్రాంతాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలని కోరారు. కాకినాడ ఎన్‌టీఆర్ బీచ్‌లో ఎకో టూరిజం అభివృద్ధికి ఉన్న ప్రాధాన్యతను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈ సందర్భంగా వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్‌టీఆర్ బీచ్‌ను సుస్థిర పర్యాటక గమ్య స్థానంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్నిచర్యలుచేపడుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ తీర ప్రాంత పారిశుధ్య కార్యక్రమం ద్వారా సామూహిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, సుస్థిర తీర ప్రాంత నిర్వహణ, ఎకో-టూరిజం అభివృద్ధి వంటి అంశాలపై బలమైన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రస్తుత సమాజంతో పాటు భవిష్యత్తు తరాల ప్రయోజనాల ను దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన, పర్యావరణహితమైన తీర ప్రాంతాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుని పై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి లక్ష్మణరావు, కాకినాడ కమిషనర్ సత్యనారాయణ, పంచాయతీ అధికారి రవికుమార్,కాకినాడ రూరల్ ఎంపీడీవో సతీష్, కౌడా అధికారులు, కేఎస్పీఎల్, వేదాంత, రిలయన్స్, ఓఎన్జీసీ, షాపూర్జీ పల్లోంజి, కోరమండల్ వంటి ప్రముఖ పారిశ్రామిక, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు వివిధ చమురు నిర్వహణ భాగస్వాములు, కోస్ట్ గార్డ్ విశ్రాంత సైనికులు, స్థానిక పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో రక్తనిధి కేంద్రాల పనితీరుపై జిల్లా కలెక్టర్ కీలక ఆదేశాలు

**రక్త లభ్యత, సురక్షిత రక్త మార్పిడికి పటిష్ట చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలోని రక్తనిధి కేంద్రాల పనితీరును మరింత మెరుగు పరచడంతో పాటు, అత్యవసర సమయాల్లో రోగులకు సురక్షితమైన రక్తం సకాలంలో అందేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు,జిల్లాలోని 12 రక్తనిధి కేంద్రాల ప్రతినిధుల తో రక్తనిధి కేంద్రాల పని తీరు,రక్త సేకరణ లక్ష్యాల సాధన,రక్త మార్పిడి సేవలు, రక్తనిధి కేంద్రాల నిర్వహణ, మొబిలైజేషన్ ఫర్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాల అమలు, పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ నెలాఖరు నాటికి జిల్లా లోని 12 రక్త నిధి కేంద్రాలు నిర్దేశించిన రక్త సేకరణ లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. తుని ప్రాంతీయ ఆసుపత్రి లోని రక్తనిధి కేంద్రం మార్చి నెల నాటికి పూర్తిస్థాయిలో పనిచేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.కాకినాడ జీజీహెచ్ రక్తనిధి కేంద్రంలో ఉన్న పరికరాల కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జిల్లాలోని రక్తనిధి కేంద్రాలన్నీ నిర్దేశిత అనుమతుల తో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, రక్త సేకరణ,పరీక్షలు,నిల్వ, పంపిణీ,రక్త మార్పిడి వంటి ప్రక్రియల్లో నిర్దేశిత భద్రతా, నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రక్తనిధి కేంద్రాల్లో రక్త నిల్వల పై





ప్రత్యేక దృష్టి సారించి, వివిధ రక్త గ్రూపుల లభ్యత ను నిరంతరంపర్యవేక్షించాలని సూచించారు. రక్త సేకరణను పెంచేందుకు స్వచ్ఛంద రక్తదాన కార్య క్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, యువత, విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సామాజిక సంస్థల సహకారం తో మరిన్ని రక్తదాన శిబిరాల ను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రక్త కొరత ఏర్పడే పరిస్థితులను ముందుగానే గుర్తించి, అత్యవసర సమయాల్లో అవసరమైన రక్త గ్రూపు లు అందుబాటులో ఉండేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా అమలు చేస్తున్న సురక్ష కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, అపోహలను తొలగించడం, అవసరమైన వారికి కౌన్సెలింగ్, పరీక్షలు, ఏఆర్టి చికిత్సా సేవలు అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రక్త నిధి కేంద్రాల కార్యక్ర మాలకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను ప్రతి విభాగం నిర్దేశిత లక్ష్యాల మేరకు సాధిం చాలని స్పష్టం చేశారు. గత జూలై నెలలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలులో కాకినాడ జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు జిల్లా వైద్య ఆరోగ్య యంత్రాంగం చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తి తో రానున్న కాలంలోనూ కార్యక్రమాల అమలులో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలో అవగాహన కల్పించాలని, సంబంధిత శాఖలు,రక్తనిధి కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు సమ న్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలను అర్హులకు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. అనిత, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ మహేశ్వరరావు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎస్. చలమయ్య, డ్రగ్ ఇన్ స్పెక్టర్ మురళి, వైద్యులు స్రవంతి, రాజేశ్వరి,ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బాలాజీ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులు, రక్తనిధి కేంద్రాల ప్రతినిధులు, సంబంధిత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

**గ్రామీణ ప్రాంత మహిళలకు**

# కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తున్న గంగాభవాని

**అభినందించిన ఎమ్మెల్యే దివ్య**



**కోటనందూరు, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** డిజిటల్ యుగంలో డిజిటల్ నైపుణ్యంపై గ్రామీణులకు మోటివేషన్ కల్పిస్తున్న తాటిపర్తి గంగాభవాని దృక్పథం అభినందనీయమని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు. కాకినాడ జిల్లా,తొండంగి మండలం, పంపాదిపేటకు చెందిన తాటిపర్తి భవాని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో టీటీటీ డబ్ల్యు ఎస్ ద్వారా శిక్షణ పొంది గ్రామీణులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై గృహిణులు, విద్యార్థులకు మోటీవేషన్ కల్పించడం స్వాగతిస్తున్నానని ఆమె అన్నారు.తేటగుంట క్యాంప్ కార్యాలయంలో తాటిపర్తి భవానికి ఎమ్మెల్యే యనమల దివ్య సర్టిఫికెట్ ప్రధానం చేసి అభినందించారు.

# సామాజిక శాస్త్రవేత్త బోయి భీమన్న జయంతి వేడుకలు



**కాకినాడ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధునిక సాహిత్య రంగంలో ప్రజా సాహిత్యాన్ని సృష్టించిన మహాకవి బోయి భీమన్న సమస్త మానవాళి శ్రేయస్సును కాంక్షించారని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనం లో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బోయి భీమన్న జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడికుదురు లో 1911 సెప్టెంబర్ 19న బోయి భీమన్న జన్మించారని అన్నారు. పాలేరు, గుడిసెలు కాలిపోతున్నాయి వంటి పలు నాటకాలను రచించి అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను సమాజం దృష్టికి తీసుకొచ్చి ఆయా వర్గాలను చైతన్యవంతం చేశారని అన్నారు. పద్మశ్రీ ,పద్మ విభూషణ్ వంటి పురస్కారాలను బోయి భీమన్న అందుకున్నారని రాఘవేంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్ ,చింతపల్లి సుబ్బారావు, గోపి, పి.ధర్మచంద్ర రాజు, సత్యనారాయణ, రాజా, ఓం నమశ్శివాయ, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**కాకినాడ సబ్ జైలును తనిఖీ చేసిన**

# 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి



**కాకినాడ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖైదీల సంక్షేమం భద్రత,జీవన పరిస్థితులను తనిఖీ చేసేందుకు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ 3 వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది శనివారం కాకినాడ సబ్ జైలును రెవెన్యూ, పోలీస్,విద్యా,వైద్య ఆరోగ్యం,ఉపాధి శిక్షణ,సాంఘిక సంక్షేమం,పరిశ్రమలు,ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది ఖైదీల సంక్షేమం,భద్రత, ఆరోగ్యం, తాగునీరు, ఆహారం,పారిశుధ్యం, మరుగు దొడ్లు, ప్రస్తుత బ్యారక్ ల పరిస్థితి ఇతర మౌలిక సదు పాయాలు వంటి అంశాలపై నేరుగా ఖైదీలతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. సబ్ జైలు లోని వంటసాల ను తనిఖీ చేసి మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం మహిళా ఖైదీల సదు పాయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది మాట్లాడుతూ ఖైదీల సంక్షేమం భద్రత, జీవన పరిస్థితులను తనిఖీ చేసేందుకు ప్రతి 3 నెలలకు ఒకసారి మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ సబ్ జైలును తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఖైదీల ఆరోగ్యం భోజనం, తాగు నీరు,పారిశుధ్య, మరుగుదొడ్లు సదుపాయం, ఇతర మౌలిక సదుపాయా లను పరిశీలించారు. ఈ పరిశీలనలో మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి వెంట కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు,జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.కె.అనిత, జిల్లా ఉపాధి అధికారి, ఇంచార్జి సాంఘిక సంక్షేమ అధికారి జి. శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి రామారావు,సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు,డిప్యూటీ జైలర్ పి.జోసేఫ్, విద్యా, పోలీస్, ఇరిగేషన్, పరిశ్రమల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనను**

# విజయవంతం చేయాలి

**కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పిలుపు**



**కాకినాడ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు , పిఠాపురం శాసన సభ్యుడు పవన్ కళ్యాణ్ ఈ నెల 21, 22 తేదీల్లో పిఠాపురం నియోజక వర్గంలో నిర్వహించ నున్న రెండు రోజుల పర్యటనను విజయవంతం చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ జనసేన పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. శనివారం కాకినాడలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో పిఠాపురం పట్టణం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాలకు చెందిన జనసేన పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల తో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సమావేశమై రెండు రోజుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ పై నాయకులతోను కార్యకర్తలతో చర్చించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటన లో భాగంగా నియోజకవర్గం లో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నారని ఎంపీ తెలిపారు. అలాగే ఈ నెల 22 వ తేదీన పిఠాపురం పట్టణంలో నిర్వహించ నున్న భారీ బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు. ఈ సభకు నియోజక వర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి ప్రజలు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చేలా నాయకులు సమన్వయం తో ఏర్పాట్లు చేయాలని ఎంపీ సూచించారు. పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి గ్రామంలోని పార్టీ నాయకులు, మండల స్థాయి నాయకత్వం, గ్రామ కమిటీలు, కార్యకర్తలు సమన్వయం తో పనిచేయాలని ఎంపీ కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, క్రమశిక్షణతో కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశం లో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు , డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు ,కౌడా చైర్మన్ తలాటం సత్య, గోదావరి ఇస్టన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, డా.బుర్రా దివ్యరాజ్ నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సనాతన ధర్మ పరిరక్షణే శ్వాస..

# సమాజ సేవలో అలుపెరుగని ఆదర్శం

- హైందవ సంస్కృతి, సంప్రదాయాల కాపలాదారుగా కంబాల శ్రీనివాసరావు
- మహిళామణులకు అత్యున్నత గౌరవం దక్కాలన్నదే ప్రధాన ఆకాంక్ష
- మూఢనమ్మకాలు వీడి.. ఆధ్యాత్మికతకు సైన్స్‌ను జోడించాలని పిలుపు
- సేవా మార్గంలో ముప్పై ఐదు కోట్ల వ్యయంతో బృహత్తర కార్యక్రమాలు
- శ్రావణ మాసంలో లక్షలాది మంది మహిళలకు పట్టుచీరల పంపిణీ
- విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన ద్వారా రాజీలేని పోరాటం
- వీఎల్ పురంలో కన్నులపండువగా 49వ గణనాథుని నవరాత్రి ఉత్సవాలు
- తారకరామ నామ స్మరణతో మార్మోగిన ఉత్సవ ప్రాంగణం
- 27న అంగరంగ వైభవంగా విఘ్నేశ్వరుని మహా శోభాయాత్ర



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక విఎల్ పురం చారిత్రక నగరం రాజమహేంద్రవరం వేదికగా హైందవ ధర్మ పరిరక్షణ, భారతీయ సనాతన సంప్రదాయాల విశిష్టతపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాసరావు తనదైన శైలిలో గళమెత్తారు. వీఎల్ పురం సెంటర్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న వరసిద్ధి వినాయక 49వ నవరాత్రి మహోత్సవాల వేదిక నుంచి ఆయన చేసిన ప్రసంగం భక్తుల్లో తీవ్ర ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించింది. కేవలం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో సామాజిక సేవను చూపిస్తున్న ఆయన.. ధర్మ రక్షణ అనేది ప్రతి పౌరుడి కనీస బాధ్యతగా గుర్తుచేశారు. అలుపెరుగని ధర్మయోధుడిగా, నిస్వార్థ సేవకుడిగా కంబాల శ్రీనివాసరావు చేస్తున్న సేవలు నేటి తరానికి దిక్సూచిగా నిలుస్తున్నాయని స్థానికులు కొనియాడుతున్నారు. భారతీయ జీవన విధానంలో మహిళలకు ఉన్న ప్రాముఖ్యతను ఆయన అత్యంత సునిశితంగా వివరించారు. ఆడపడుచులను కేవలం మనుషులుగా కాకుండా సాక్షాత్తూ లక్ష్మీ, సరస్వతి, పార్వతీ దేవుల ప్రతిరూపాలుగా ఆరాధించే గొప్ప సంస్కృతి ఈ గడ్డదేనని ఉద్ఘాటించారు. సమాజ, కుటుంబ నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తున్న మహిళల భద్రత, సాధికారత పట్ల ఎవరికీ రాజీ పడే హక్కు లేదని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో ఆధ్యాత్మికతను గుడ్డిగా ఆచరించడం కాకుండా, దానికి శాస్త్రీయ దృక్పథాన్ని జోడించి హేతుబద్ధంగా ఆలోచించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. వేల ఏళ్ల క్రితమే మన పూర్వీకులు అందించిన విజ్ఞానం, మానవ దేహంలోని శక్తి వలయాలపై నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలను ఉదహరిస్తూ.. హిందూ ధర్మం ఎంత శాస్త్రీయమైనదో సోదాహరణంగా వివరించారు. రాజకీయాలకు అతీతంగా సమాజ సేవలో తనదైన ముద్ర వేస్తున్న కంబాల శ్రీనివాసరావు దాతృత్వం విశేషమైనది. రెండు వేల ఇరవై రెండులో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అనే సంస్థను స్థాపించి రాజానగరం, జగ్గంపేట, పోలవరం నియోజకవర్గాల్లో మునుపెన్నడూ లేని విధంగా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఏకంగా ముప్పై ఐదు కోట్ల రూపాయల సొంత నిధులను వెచ్చించి ఆయన చేసిన సేవలు సర్వత్రా ప్రశంసలు అందుకుంటున్నాయి. ముఖ్యంగా పవిత్ర శ్రావణ మాసంలో లక్షలాది మంది నిరుపేద మహిళలకు పట్టుచీరలు, బంగారు ఆభరణాలు పంపిణీ చేసి వారి ఇళ్లలో పండుగ వాతావరణం తీసుకువచ్చారు. సేవను కేవలం ప్రచార ఆర్భాటాలకు వాడుకోకుండా, క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులకు అందేలా ఆయన చేస్తున్న నిర్విరామ కృషి అనేక మందికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. తారకరామ నామ స్మరణలో ఉన్న అద్భుత శక్తిని, పంచభూతాలు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని ఆయన లోతుగా విశ్లేషించారు. రామనామంపై విదేశీయులు సైతం ఆకర్షితులై విస్తృత పరిశోధనలు చేస్తుండటం సనాతన ధర్మం గొప్పదనానికి నిదర్శనమన్నారు. ఇక వీఎల్ పురంలో సెప్టెంబర్ పద్నాలుగున ప్రారంభమైన గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. భారీ విఘ్నేశ్వరుని విగ్రహం, కళ్లు చెదిరే విద్యుత్ దీపాలంకరణలు, సువాసనలు వెదజల్లే పుష్పాలంకరణల నడుమ ప్రతిరోజూ వేద మంత్రోచ్చారణలు, విశేష అభిషేకాలు, భజనలతో ఆ ప్రాంతమంతా భక్తిభావంతో మారుమోగుతోంది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వాసిరెడ్డి బాబి నేతృత్వంలోని ఆలయ కమిటీ, యువత మిత్ర బృందం, బీజేపీ శ్రేణులు, వేలాది మంది స్థానికులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. జై శ్రీరామ్ నినాదాలతో ఉత్సవ ప్రాంగణం దద్దరిల్లింది. భక్తితో పాటు సామాజిక బాధ్యతను కూడా గుర్తుచేసేలా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 27 ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే గణనాథుని భారీ శోభాయాత్రను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేసేందుకు నిర్వాహకులు సర్వసన్నద్ధమయ్యారు.

# బత్తుల ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**కోరుకొండ, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న పలువురుకు జనసేన పార్టీ నా సేన కోసం-నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. శనివారం కోరుకొండ మండలంలోని గాడాలలో అడపా సుబ్బలక్ష్మి 42వేలు, మధురపూడి పిట్టా పద్మ 30వేలు,నిడిగట్ల బర్రి రామకృష్ణ 43వేలు,దోసకాయలపల్లి వాసంశెట్టి దేవి వెంకటలక్ష్మి 45వేలు, బూరుగుపూడి కోరల్ల మంగతాయారు 59వేలు,అడపా వీరచంద్ర విజయదుర్గ 41వేలు, శ్రీరంగపట్నం ముత్యాల దేవి 25 వేల రూపాయలు చెక్కులను ఆమె చేతుల మీద అందజేసి, బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు అడ్డాల శ్రీను,అడపా శ్రీనివాస్, దేవన దుర్గాప్రసాద్, ముక్కా రాంబాబు, తన్నీరు తాతాజీ, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నందివాడ వారి వీధిలో శాస్త్రోక్తంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం

గణనాథునికి మహోత్సవంగా నిత్య పూజలు



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 23వ డివిజన్లో ఉన్న నందివాడ వారి వీధిలో శ్రీ వజ్ర గణపతి ఆలయ మందిరం వారి శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నిత్య పూజా కార్యక్రమాలు మహోత్సవంగా జరిగాయి. శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలో బొర్రా నాగేంద్రబాబు, మౌనిక రాజేశ్వరి దేవి దంపతులచే పూజా కార్యక్రమాలు జరిగాయి.అనంతరం మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, సూర్య కుమారి, వారి కుమార్తె అల్లుడు పూసరపు వీరేంద్ర కుమార్, ఆషా,పొత్తూరి యతిరాజు సంపత్ కుమార్, రేణుక, పొత్తూరి వెంకట సత్యనారాయణ, సుమ దంపతులచే శ్రీ లక్ష్మీ గణపతి హోమం, గరిక పూజ అత్యంత వైభవంగా జరిగింది. పురోహితులు బోడెం రవి కుమార్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ మహోత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.నవరాత్రులు సందర్భంగా ప్రతిరోజు రాత్రి స్వామి వారికి ఏకాదశ హరతులు ఇస్తున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్లు ఆదిరెడ్డి వీర్రాఘవమ్మ, పంతం రజిని శేషసాయి,పేరూరి మహేంద్రనాథ్,సరిదే ధన వెంకటేశ్వరరావు, కనమర్లపూడి చంద్రకాంత్, మారడుగుల సుబ్బయ్య, వానపల్లి మురళీకృష్ణ, నంబూరి కృష్ణ చైతన్య, సోమిశెట్టి భీమేశ్వరరావు, జ్యోతి రామ్ విఠల్ మోరే, వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ హాజరయ్యారు.

# కుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు

స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్‌ను మరింత విస్తృతం చేయాలి - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిశీలన

ఏబీసీ సెంటర్ పరిశీలన - అధికారులు, సిబ్బంది, జంతు ప్రేమికులతో సమీక్ష



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో వీధి కుక్కల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. క్వారీ ఏరియాలోని ఏబీసీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బంది, జంతు ప్రేమికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీసీ సెంటర్లో వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు నిర్వహించడం, స్టెరిలైజేషన్ అనంతరం వాటికి అందిస్తున్న సంరక్షణ, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్, ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించి తిరిగి ఆయా ప్రాంతాల్లో వదిలే ప్రక్రియపై ఎమ్మెల్యే వాసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఉన్న మౌలిక వసతులు, వైద్య పరికరాలు, సిబ్బంది, రోజువారీ నిర్వహిస్తున్న శస్త్రచికిత్సల సంఖ్య తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నగరంలో సుమారు 25,865 వీధి కుక్కలను గుర్తించగా, ఇప్పటివరకు 15,126 కుక్కలకు స్టెరిలైజేషన్‌తో పాటు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేసినట్లు అధికారులు ఎమ్మెల్యే వాసుకు వివరించారు. ఏబీసీ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో జీజీయూ విద్యార్థుల ప్రతిభ



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026లో భాగంగా గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో శనివారం అంతర్గత హ్యాకథాన్ నిర్వహించారు. విశ్వవిద్యాలయానికి చెందిన 60 విద్యార్థి బృందాలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నాయి. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో నిర్దేశించిన సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించిన విద్యార్థులు వాటిని న్యాయనిర్ణేతల సమక్షంలో ప్రదర్శించారు. వివిధ సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిష్కారాలు చూపేందుకు విద్యార్థులు చేసిన ప్రయత్నాలు ఆకట్టుకున్నాయి. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన నమూనాలు, ప్రాజెక్టులను న్యాయనిర్ణేతలు పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టులోని సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్టుల ఆచరణ సాధ్యత, నూతనత్వం, సమస్య పరిష్కార సామర్థ్యం, సాంకేతికత వినియోగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సమీక్షించారు. విద్యార్థుల ఆలోచనల్లో ఉన్న లోపాలను గుర్తించి వాటిని మరింత మెరుగుపర్చేందుకు సూచనలు చేశారు. వాస్తవ జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సులభమైన, సమర్థవంతమైన పరిష్కారాలను రూపొందించే దిశగా విద్యార్థులు ఆలోచించాలని న్యాయనిర్ణేతలు సూచించారు. కేవలం సాంకేతిక నమూనాల రూపకల్పనకే పరిమితం కాకుండా వాటిని ఆచరణలోకి తీసుకువచ్చేలా ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అంతర్గత హ్యాకథాన్‌లో ప్రతిభ కనబరిచిన, ఎంపికైన, సిఫారసు చేయబడిన వినూత్న ఆలోచనలను తదుపరి దశలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అధికారిక వేదికలో నమోదు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు తమ ఆలోచనలను నిపుణుల ముందు ప్రదర్శించే విలువైన అవకాశాన్ని కల్పించింది. న్యాయనిర్ణేతల సూచనలతో తమ ప్రాజెక్టులను మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దుకునే అవకాశం లభించింది. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ కొత్త ఆలోచనలను ఆవిష్కరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు సమస్యలను విశ్లేషించి పరిష్కారాలను కనుగొనే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంలో అంతర్గత హ్యాకథాన్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయ ఉపకులపతి, సహ ఉపకులపతి, రిజిస్ట్రార్, వివిధ విభాగాల సంచాలకులు, డీన్లు హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను వారు పరిశీలించి అభినందించారు. విద్యార్థుల ఆలోచనా విధానం, సాంకేతిక పరిజ్ఞానం, సమస్యలను గుర్తించి పరిష్కారాలను రూపొందించే తీరు ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని కేవలం తరగతి గదులకే పరిమితం చేయకుండా సమాజ అవసరాలను గుర్తించి పరిష్కారాలను రూపొందించాలని సూచించారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు పెరిగితే దేశం సాంకేతికంగా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి కార్యక్రమాలు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లను అవకాశాలుగా మలుచుకుని కొత్త పరిష్కారాలను రూపొందించాలని సూచించారు. అంతర్గత హ్యాకథాన్‌లో పాల్గొన్న ప్రతి బృందానికి తమ ఆలోచనలను వివరించే అవకాశం కల్పించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టుల ఉద్దేశ్యం, ఉపయోగం, సాంకేతిక విధానం, భవిష్యత్తులో వాటిని మరింత అభివృద్ధి చేసే అంశాలను వివరించారు. న్యాయనిర్ణేతలు విద్యార్థులతో నేరుగా చర్చించి వారి ప్రాజెక్టులకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు వాటికి సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోటీ తత్వంతో పాటు బృందంగా పనిచేసే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచనా విధానం పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను రూపొందించేందుకు జీజీయూ విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తామని విశ్వవిద్యాలయ ప్రతినిధులు తెలిపారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే యువతను ఆవిష్కరణల వైపు నడిపించేందుకు ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# నన్నయ వర్సిటీలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో టీనేజ్ మరియు కౌమారదశలో వచ్చే క్యాన్సర్లపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి చంద్రకళ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రాజమండ్రి చైర్మన్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. విశ్వనాథ్ పట్నాల ప్రధాన వక్తగా విచ్చేసి క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో ప్రపంచాన్ని వణికిస్తున్న భయంకరమైన సమస్య క్యాన్సర్ అని అన్నారు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారికి క్యాన్సర్ వస్తుందని, కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ వ్యాధికి గురికాకుండా ఉండొచ్చని సూచించారు. క్యాన్సర్ దరిచేరకుండా ఉండాలంటే ధూమపానం మద్యపానాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి ఆహారం, శారీరక వ్యాయామం ఎంతో అవసరమని తెలియజేశారు. క్యాన్సర్‌కు సంబంధించిన అవగాహన, నివారణ, ముందస్తు గుర్తింపు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. టీనేజ్ మరియు కౌమారదశలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం, అనుమానాస్పద లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతికి దూరంగా ఉంటే పాశ్చాత్య వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని తెలియజేశారు. అనంతరం వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ డాక్టర్ విశ్వనాథ్ ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ ఎన్. ఉదయ్ భాస్కర్, విశ్వవిద్యాలయ అధ్యాపకులు ఆధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మణికంఠ వైద్య ఖర్చులకు

# కుడుపూడి సత్తిబాబు రూ.10 వేల ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలానికి చెందిన శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన ముల్లాల మణికంఠ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని రాజమహేంద్రవరంలోని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబుని ఆయన కార్యాలయంలో కలిసి తన పరిస్థితిని వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన కుడుపూడి సత్తిబాబు మణికంఠ వైద్య ఖర్చుల కోసం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ తరఫున శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, తన శక్తి మేరకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన సత్తిబాబుకు మణికంఠ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మమేకం...

# తల్లీబిడ్డల సంక్షేమంపై దృష్టి



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్: మహిళా మోర్చా ఆధ్వర్యంలో సేవా సంకల్ప కార్యక్రమాల భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పలు కేంద్రాల్లో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించి గర్భిణీలు, చిన్నారుల కుటుంబాలతో నాయకులు మమేకమయ్యారు. కార్యక్రమం పాల్ అడుగుల శ్రీవిద్య ఆధ్వర్యంలో జరిగింది. మండలంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ తల్లీబిడ్డల సంక్షేమంపై చర్చలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలు, సౌకర్యాలపై లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు కేంద్రాలను పరిశీలించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. తల్లులు, చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రాథమిక విద్యపై వివరాలు సేకరించారు. అంగన్‌వాడీ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రారంభ విద్యలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో ముఖ్యమని నాయకులు తెలిపారు. ఈ సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తల్లులు, చిన్నారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విశేష సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను సన్మానించి అభినందించారు. వారి సేవలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సేవా భావనను పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న కృషి సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగళ్ళ శివకుమార్, కె. సురేష్, కమల కుమారి, సోము సతీష్ తదితరులు పాల్గొన్నారు. మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# రెండో బిడ్డకు జన్మనిచ్చిన దీపిక పదుకొణె



బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణే మరోసారి తల్లి అయ్యారు. ఈ శుభవార్తను శనివారం మధ్యాహ్నం తమ సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఈ దంపతులకు సినీ ప్రముఖులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. దీపికా, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని తెలిసింది. ఇదివరకే దీపికా పదుకొణే, రణవీర్ దంపతులకు ఆడబిడ్డ జన్మించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ స్టార్ కపుల్ దీపిక పదుకొణె, రణవీర్ సింగ్ దంపతులు మరోసారి తల్లిదండ్రులుగా మారారు. దీపికా రెండో బిడ్డకు జన్మనిచ్చింది. ఈ శుభవార్తను దీపిక, రణవీర్ దంపతులు శనివారం మధ్యాహ్నం సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆ పోస్ట్ ద్వారా, తమ కుటుంబంలోకి రెండోసారి లక్ష్మి వచ్చిందని, ఆ నటి ఒక అందమైన ఆడబిడ్డకు జన్మనిచ్చిందని వారు తెలిపారు. నిన్న దీపికా, రణవీర్ సిద్ధి వినాయక్ దర్శనానికి వెళ్లారు. అప్పటి నుంచి ఆమె రెండో బిడ్డ రాక గురించి వదంతులు వ్యాపిస్తున్నాయి. ఆ వీడియో కూడా వైరల్ అయింది. ఆ తర్వాత ఆడబిడ్డ పుట్టిన వార్తతో దీపికా అభిమానులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. దీపిక, రణ్‌వీర్ ఒక నవజాత శిశువు మధురమైన పాదముద్రలను చూపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. ఈ ప్రముఖ జంట ఆ చిత్రానికి ఇచ్చిన క్యాప్షన్‌లో తమ అభిమానులకు, ఆరాధకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పోస్ట్ పబ్లిక్‌గా వచ్చిన వెంటనే, బలిపారాలోని వారి సహోద్యోగుల నుండి ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అభిమానులు వారిపై ప్రేమను, శుభాకాంక్షలను కురిపించారు. చాలా కాలం పాటు సాగిన ప్రేమాయణం తర్వాత, దీపికా పడుకోన్ మరియు రణవీర్ సింగ్ నవంబర్ 2018లో ఇటలీలోని లేక్ కోమోలో ఒక అద్భుతమైన వేడుకలో వివాహం చేసుకున్నారన్నది గమనార్హం. ఆ రాజరికపు వివాహపు చిత్రాలు చాలా కాలం పాటు ఇంటర్నెట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఆ తర్వాత 2024 సెప్టెంబర్‌లో దీపిక, రణ్‌వీర్‌లకు మొదటి బిడ్డ జన్మించింది. ఆ సమయంలో వారి ఇంట్లోకి ఒక కుమార్తె కూడా వచ్చింది. వారు తమ మొదటి కుమార్తెకు 'దువా పడుకోన్ సింగ్' అని పేరు పెట్టారు. దువా తర్వాత, ఈ పవర్ కపుల్‌కు కుమార్తె జన్మించడం ఇది రెండవసారి. ఇప్పుడు, ఇద్దరు కుమార్తెల రాకతో రణ్‌వీర్-దీపిక కుటుంబంలో ఆనందపు వెల్లువ వెల్లివిరుస్తోంది.

వరుసగా వెయ్యి కోట్ల కలెక్షన్స్..
హ్యాట్రిక్ హిట్టుతో సెన్సేషన్..

# ఇప్పుడు ఈ హీరోయిన్‌దే జోరు..

ఇటీవల సౌత్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టిస్తున్న ఈ యంగ్ హీరోయిన్ గురించి ఇప్పుడు అందరూ మాట్లాడుకుంటున్నారు. ఆమె వరుసగా హ్యాట్రిక్ హిట్లు ఇస్తోంది. ఆమె ఎవరో మీకు తెలుసా? అంతేకాదు.. ఇప్పుడు ఆమెకు వరుస అవకాశాలు క్యూ కట్టాయి. బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ అయిన ఈ హీరోయిన్ ఎవరు అనే విషయాలు తెలుసుకుందామా. సాధారణంగా భారీ బడ్జెట్‌లతో తీసిన సినిమాలు తరచుగా బాక్సాఫీస్ వద్ద విఫలమవుతాయి. దీనికి ఉదాహరణ ఇటీవల విడుదలైన 'టాక్సిక్' సినిమా తీవ్ర నిరాశ పరిచిన సంగతి తెలిసిందే. సుమారు రూ. 500 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటించిన ఈ మూవీ నిరాశపరిచింది. ఆకట్టుకునే కథాంశాలున్న తక్కువ బడ్జెట్ చిత్రాలు ప్రజాదరణ పొందుతున్నాయి. అయితే ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ఓ హీరోయిన్ సౌత్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టిస్తుంది. 5 చిత్రాలలో నటించి, రూ. 1000 కోట్లు వసూలు చేసిన నటి గురించి మీకు తెలుసా? ఆమె మరెవరో కాదు మమితా బైజు. ఆమె ప్రస్తుతం వరుస అవకాశాలు అందుకుంటున్నాయి. ఆమె నటించిన విడుదలైన చిత్రాలు అభిమానుల నుండి మంచి స్పందనను అందుకుంటున్నాయి. మమితా బైజు 2017లో విడుదలైన 'సర్వోపరి బాలక్కరన్' చిత్రంతో సినీ పరిశ్రమలో నటిగా అరంగేట్రం చేశారు. ఆమె మలయాళంలో అనేక చిత్రాలలో నటించినప్పటికీ, 'ప్రేమలు' చిత్రమే ఆమెకు మలయాళం దాటి ఇతర భాషలలోనూ మంచి పేరు తెచ్చిపెట్టింది. 'రెబెల్' సినిమా మమితకు తమిళ చిత్రసీమలో ప్రవేశం కల్పించినప్పటికీ, 'డ్యూడ్' ఆమెకు అద్భుతమైన అరంగేట్రాన్ని అందించింది. ధనుష్ నటించిన 'కర' చిత్రంలో ఆమె అద్భుతంగా నటించింది. ఆ సినిమా తర్వాత, ఆమె విజయ్ నటించిన 'జననాయకన్' చిత్రంలో నటించింది. ఆ తర్వాత, మమిత బైజు 'విశ్వనాథ్ అండ్ సన్స్' , 'బెత్లెహెం కుటుంబ యూనిట్' చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకుంది. బాక్సాఫీస్ వసూళ్ల పరంగా, మమిత నటించిన 'ప్రేమలు' రూ. 130 కోట్లు సంపాదించింది. 'డ్యూడ్' రూ. 100 కోట్లకు పైగా వసూలు చేసింది. విజయ్ నటించిన 'జననాయకన్' రూ. 300 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. సూర్య నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ. 260 కోట్లు వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. నివిన్ పౌలీ నటించిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్' రూ. 300 కోట్లు వసూలు చేసి మలయాళంలో రికార్డు సృష్టించింది. దీంతో మమితా బైజు వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపాదించిన నటిగా గుర్తింపు పొందారు. ఆమె నటించిన చిత్రాలను అభిమానులు కనీస గ్యారెంటీగా ఆదరించారు. ఒక యువ నటిగా మమితా కేవలం మలయాళంలోనే కాకుండా తమిళంలో కూడా బిజీగా ఉండటం గమనార్హం.



# ఆయన 12వేల పరుగులు చేసిన తోపేమో.. నా ముందు మాత్రం ఓ బచ్చా.. ఏకంగా 16 సార్లు షాకిచ్చా..

అంతర్జాతీయ క్రికెట్‌లో తన భీకర పేస్ బౌలింగ్‌తో బ్యాటర్లను వణికించిన సౌతాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ తన కెరీర్‌కు సంబంధించిన ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. పాకిస్థాన్ సీనియర్ ఆటగాడు మహమ్మద్ హఫీజ్ తన బౌలింగ్‌లో ఎన్నోసార్లు పెవిలియన్‌కు చేరాడని ఆయన గుర్తుచేసుకున్నాడు. సౌతాఫ్రికా తరపున సుదీర్ఘకాలం పాటు అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ అంతర్జాతీయ క్రికెట్‌లో సుమారు ఏడు వందల వికెట్లను సాధించి అగ్రశ్రేణి బౌలర్‌గా నిలిచాడు. తన 15 ఏళ్ల ప్రయాణంలో ఎంతోమంది దిగ్గజ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన ఈ స్పీడ్ గన్, రిటైర్మెంట్ తరువాత ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మాజీ సహచర ఆటగాడు వెర్నాన్ ఫిలాండర్‌తో మాట్లాడిన సందర్భంగా, ప్రస్తుత వయసులో కూడా తాను మళ్లీ బౌలింగ్ చేయడానికి ఇష్టపడే ఒక్కే ఒక్క బ్యాటర్ ఎవరనే ప్రశ్నకు ఆయన పాక్ మాజీ కెప్టెన్ మహ్మద్ హఫీజ్ పేరును బదులిచ్చాడు. క్రికెట్



ప్రపంచంలో హఫీజ్ వర్సెస్ స్టెయిన్ పోరు ఒకానొక దశలో అత్యంత ఏకపక్షంగా సాగిందని చెప్పవచ్చు. డేల్ స్టెయిన్ బౌలింగ్‌లో హఫీజ్ అనేకసార్లు ఇబ్బంది పడుతూ తక్కువ పరుగులకే వెనుదిరిగాడు. 2013లో జరిగిన సౌతాఫ్రికా పర్యటనలోనూ హఫీజ్ వికెట్ పడినప్పుడు స్టెయిన్ మైదానంలో నవ్వుతూ కనిపించిన దృశ్యాలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. స్టెయిన్ వేసిన ప్రమాదకరమైన డెలివరీలను ఎదుర్కోవడంలో హఫీజ్ తీవ్రంగా తంటాలు పడ్డారు. గణాంకాల ప్రకారం అన్ని ఫార్మాట్లలో కలిపి హఫీజ్‌ను స్టెయిన్ 15 సార్లు ఔట్ చేయడం గమనార్హం. ఇందులో ఒక్క టెస్టు క్రికెట్‌లోనే 8సార్లు ఆయనను బోల్తా కొట్టించాడు. విపరీతమైన ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ మహ్మద్ హఫీజ్ పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకరిగా గుర్తింపు పొందాడు. 2007 ప్రారంభ టీ20 ప్రపంచకప్ ఫైనల్ చేరిన జట్టులో ఆయన కీలక సభ్యుడిగా ఉన్నాడు. అలాగే 2017లో ఇంగ్లండ్‌లో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న పాక్ జట్టులోనూ తన వంతు పాత్ర పోషించాడు. టెస్టులు, వన్డేలు, టీ20లు అన్ని ఫార్మాట్లలో కలిపి ఆయన పన్నెండు వేలకు పైగా పరుగులు సాధించాడు. అలాగే తన ఆఫ్ స్పిన్ బౌలింగ్‌తో 250కి పైగా వికెట్లను పడగొట్టి అద్భుతమైన ఆల్ రౌండర్ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.




# భారత్ / వెస్టిండీస్ పోరుకు రెడీ..



టీమ్ ఇండియా వెస్టిండీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 27న తొలి వన్డే ప్రారంభమై, అక్టోబర్ 17 వరకు మ్యాచ్‌లు జరగనున్నాయి. త్రివేండ్రం, గుహటి, హైదరాబాద్ వంటి నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను టీమ్ ఇండియా 3-0 తేడాతో కైవసం చేసుకుంది. ఇప్పుడు స్వదేశంలో వెస్టిండీస్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 17 మధ్య భారత్ మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడనుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ సిరీస్‌కు సంబంధించిన వన్డే, టీ20 జట్లను ఇప్పటికే ప్రకటించింది. వెస్టిండీస్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో తొలి వన్డే ఈ నెల 27న త్రివేండ్రం వేదికగా జరగనుంది. రెండో వన్డే 30వ తేదీన గుహటిలో, చివరిదైన మూడో వన్డే చండీగఢ్‌లో జరగనుంది. ఈ వన్డే మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత, టీ20 సిరీస్ అక్టోబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. తొలి టీ20 మ్యాచ్ లక్నో వేదికగా అక్టోబర్ 6న, రెండో టీ20 అక్టోబర్ 9న రాంచీలో, మూడో టీ20 అక్టోబర్ 11న ఇండోర్‌లో, నాలుగో టీ20 అక్టోబర్ 14న హైదరాబాద్‌లో, చివరిదైన ఐదో టీ20 అక్టోబర్ 17న బెంగళూరులో జరగనుంది. ఈ టీ20 మ్యాచ్‌లన్నీ రాత్రి 7:00 గంటలకు మొదలవుతాయి. ఈ మ్యాచ్‌లను టీవీలో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో, ఓటీటీలో జియో హాట్‌స్టార్‌లో వీక్షించవచ్చు.

# రోహిత్ ఒక్కడే కాదా..

## అగార్కర్ గుడ్‌బై చెప్పడానికి అసలు కారణం అతనేనా..?



భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రధాన సెలెక్టర్ అజిత్ అగార్కర్ తన పదవీకాలం ముగియకముందే వైదొలగడం క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. రోహిత్ శర్మ కెరీర్ ముగింపుపై తలెత్తిన వివాదాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్‌తో విభేదాలే ఈ పరిణామానికి ప్రధాన కారణమయ్యాయి. 2027 వన్డే ప్రపంచకప్ సమీపిస్తున్న తరుణంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రధాన సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవికి వీడ్కోలు పలికాడు. ఆయన హయాంలో జట్టు నాలుగు ఐసీసీ టోర్నమెంట్లలో ఫైనల్స్‌కు చేరుకుని రెండు టీ20 ప్రపంచకప్‌లు, ఒక ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అయినప్పటికీ రోహిత్ శర్మ కెరీర్ ముగింపుపై బోర్డు పెద్దలతో వచ్చిన భేదాభిప్రాయాలు ఆయన నిష్క్రమణకు దారితీశాయి. ఇంగ్లండ్ పర్యటన ముగిసిన తరువాత జరిగిన అత్యున్నత సమీక్షా సమావేశానికి అగార్కర్ హాజరుకాకపోవడం బోర్డు వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఇంగ్లండ్ టూర్ ప్రారంభానికి ముందే లార్డ్స్ వన్డే తరువాత రోహిత్ శర్మ కెరీర్‌కు ముగింపు పలకాలని అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ గట్టి నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ప్రజ్ఞాన్ ఓజా ద్వారా రోహిత్‌కు చేరవేశారు. అయితే వచ్చే మెగా టోర్నీలో ఆడాలని భావిస్తున్న సీనియర్ ఓపెనర్ ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశాడు. నేరుగా ఒక పవర్ ఫుల్ అధికారితో మాట్లాడి తన ఆవేదనను వెళ్లగక్కగా, బోర్డు వెంటనే స్పందించి రోహిత్‌కు మద్దతు తెలుపుతూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీనివల్ల పెద్ద ఆటగాళ్ల భవిష్యత్తును నిర్ణయించే పూర్తి అధికారాలు సెలెక్టర్లకు లేకుండా పోయాయని అగార్కర్ తీవ్రంగా భావించాడు. యశస్వి జైస్వాల్ వంటి యువ ఆటగాడికి భవిష్యత్తు కోసం తగినన్ని వన్డే అవకాశాలు కల్పించాలని ఆయన కోరగా, రోహిత్ సాధిస్తున్న పరుగులు ఆయన స్థానానికి రక్షణగా నిలిచాయి. మరోవైపు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్‌తో కూడా అగార్కర్‌కు విధానపరమైన తీవ్ర విభేదాలు తలెత్తాయి. ఆసియా క్రీడలు వంటి పోటీలకు ప్రధాన ఆటగాళ్లను కేటాయించడంపై అగార్కర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఏ టోర్నమెంట్‌లోనైనా అత్యుత్తమ బలగంతో బరిలోకి దిగాలనే పట్టుదలతో లక్ష్మణ్ ఉండటం ఇరువర్గాల మధ్య అంతరాన్ని పెంచింది. అలాగే ఇండియా-ఏ మ్యాచ్‌ల షెడ్యూల్, ఇరానీ కప్ తేదీలు ఒకే సమయంలో క్లాష్ కావడం, గాయపడిన సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్ల పునరాగమన తేదీలపై ఎలాంటి స్పష్టత లేకపోవడం లాంటి పరిణామాలు సమస్యలను జటిలం చేశాయి. ఆటను నిబద్ధతతో నడిపించాలనే ఆలోచన చేసిన అగార్కర్, సెలెక్షన్ కమిటీ స్వయంప్రతిపత్తి ప్రశ్నార్థకం కావడం అలాగే బోర్డు పెద్దలతో పొసగని వాతావరణం కారణంగా తన పదవిని వీడేందుకు స్పష్టమైన నిర్ణయానికి వచ్చారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com